

# జిల్లాలో భారీగా బదిలీలు

- ముగిసిన గడువు.. పలువురు అధికారులకు స్థానచలనం

నెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల గడువు ఆదివారంతో ముగిసింది. చివరి రోజున భారీగా బదిలీలు జరిగాయి. సెలవు రోజు అయినా ప్రధానమైన శాఖల నుంచి బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆగస్టు నెలాఖరుతోనే బదిలీలకు గడువు ముగిసినా విజయవాడ వరదల నేపథ్యంలో గడువును సెప్టెంబరు 22వ తేదీ వరకు పొడిగించారు. ఐదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని తప్పనిసరిగా బదిలీ చేయగా, మిగిలిన వారిని రిక్వెస్ట్ పద్ధతిలో బదిలీ చేశారు. కీలకమైన జడ్పీ సీఈవో, డిప్యూటీ సీఈవో, డీపీవో, డీఆర్‌డీఏ పీడీ వంటి పోస్టుల్లోని అధికారులకు స్థానచలనం కలిగింది. మరికొన్ని శాఖలకు సంబంధించి జిల్లా స్థాయిలో బదిలీల ఉత్తర్వులు వెలువడ్డాయి. కీలకమైన ఇరిగేషన్ శాఖలో జీవో వెలువడినా జాబితాను విడుదల చేయలేదు. ఒకటి, రెండు రోజుల్లో వెలువడే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. సోమవారం దాదాపుగా బదిలీలు పూర్తయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**జడ్పీ సీఈవోగా ఖాదర్‌బాషా**

నెల్లూరు (జడ్పీ) : జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో చిరంజీవులు బదిలీ అయ్యారు. సీఈవో కన్నమనాయుడిని కృష్ణాజిల్లా సీఈవోగా నియమించగా, ఆయన స్థానంలో డ్వామా ఏపీడీగా ఉన్న ఖాదర్‌బాషాను జడ్పీ సీఈవోగా నియమించారు. డిప్యూటీ సీఈవో చిరంజీవిని, ఒంగోలు సీఈవోగా బదిలీ చేశారు. డీపీవో సుస్మితారెడ్డిని శ్రీకాళహస్తి డీఎల్‌డీవోగా బదిలీచేశారు. వెయిటింగ్‌లో ఉన్న శ్రీధర్‌రెడ్డిని డీపీవోగా నియమించారు. అలాగే డ్వామా పీడీ వెంకట్రావును బదిలీచేసి, ఆయన స్థానంలో చిత్తూరు పీడీ గంగాభవానీని నియమించారు.

**విద్యుత్‌శాఖలో..**

జిల్లాలో విద్యుత్‌శాఖలో ఏఈలు, జూనియర్ ఇంజనీర్లు, జూనియర్ అకౌంట్ అధికారులు, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లను బదిలీచేస్తూ ఎస్‌ఈ విజయన్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. 38మంది ఏఈలు, 12మంది జూనియర్ ఇంజనీర్లు, నలుగురు జూనియర్ అకౌంట్ అధికారులు, 12మంది సీనియర్ అసిస్టెంట్లు, 26మంది జూనియర్ అసిస్టెంట్లను బదిలీ చేశారు.

**డీఆర్‌డీఏ పీడీగా నాగరాజకుమారి**

నెల్లూరు(హరనాథపురం) : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్(పీడీ)గా నాగరాజకుమారిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆమె ప్రస్తుతం డీడబ్ల్యూఎంఏలో ఫైనాన్సు మేనేజర్‌గా పనిచేస్తున్నారు. పీడీగా పనిచేస్తున్న కేవీ సాంబశివారెడ్డిని మాతృశాఖ అయిన పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్‌లో రిపోర్టు చేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆయన మూడేళ్ల ఎనిమిది నెలలపాటు పీడీగా పనిచేశారు. డీఆర్‌డీఏలో ఎక్కువ కాలం పనిచేసిన విజయకుమార్ తరువాత రెండో పీడీగా సాంబశివారెడ్డి గుర్తింపు పొందారు.

**రెవెన్యూ శాఖలో...**

తహసీల్దార్లు ఆరుగురు, డిప్యూటీ తహసీల్దార్లు 55 మంది, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు 17 మంది, సీనియర్ అసిస్టెంట్లు 70 మంది, జూనియర్ అసిస్టెంట్లు 27 మంది బదిలీ అయ్యారు.

**అటవీశాఖలో ఇద్దరు డీఎఫ్‌వోల బదిలీ**

నెల్లూరు (వెంకటేశ్వరపురం): జిల్లా అటవీశాఖ అధికారి ఆవుల చంద్రశేఖర్‌ను అనంతపురం జిల్లా సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వోగా ప్రభుత్వం బదిలీ చేసింది. ఇన్‌చార్జి డీఎఫ్‌వోగా తిరుపతి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో జీ.ధర్మరాజును నియమించారు. నెల్లూరు సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో ఆర్.శ్రీనివాసరెడ్డిని లక్కవరం సబ్ డీఎఫ్‌వోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో కడప సామాజిక వన విభాగం డీఎఫ్‌వో ఉన్న ఎం.నాగార్జునరెడ్డిని నియమించారు. అయితే డీఎఫ్‌వోగా ఐఎఫ్‌ఎస్ అధికారి నియమించనున్నట్లు తెలుస్తోంది. అలాగే ఉదయగిరి రేంజర్‌గా ఉన్న ఉమమహేశ్వరరెడ్డిని ప్రకాశం జిల్లా కనిగిరి రేంజ్‌కి బదిలీ చేశారు. ఆయన స్థానంలో గిద్దలూరు టైగర్ ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న బీఎస్ కుమార్‌రాజాను నియమించారు. కొంతకాలంగా ఖాళీగా ఉన్న కావలి రేంజ్‌కు ప్రకాశం జిల్లా కనిగిరి రేంజ్‌లో విధులు నిర్వహిస్తున్న రామిరెడ్డిని బదిలీ చేశారు. అలాగే నెల్లూరు అటవీశాఖ కార్యాలయంలో టెక్నికల్ అధికారిగా పని చేస్తున్న దుర్గాప్రసాద్‌ను, గుంటూరు సర్కిల్ కార్యాలయానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో గుంటూరు కార్యాలయంలో విధుల్లో ఉన్న బీ కృష్ణనాయక్‌ను నియమించారు. నెల్లూరు టెరిటోరియల్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా ఉన్న పుష్పవతిని చిత్తూరు సోషల్ ఫారెస్ట్‌కు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మార్కాపురం డివిజన్‌లో పని చేస్తున్న వెంకటకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

# దుస్తులు రంగు వెలశాయా.. షూ సరిపోలేదా ?

- వాటి నాణ్యత ఎలా ఉంది...
- స్టూడెంట్స్ కిట్లపై విద్యాశాఖ అభిప్రాయ సేకరణ
- నాణ్యతతో కూడిన వస్తువులు ఇచ్చేలా కూటమి ప్రభుత్వం ప్రణాళికలు

నెల్లూరు (విద్య): జిల్లాలో పంపిణీ చేస్తున్న స్టూడెంట్స్ కిట్స్ ఎలా ఉన్నాయి..? వాటి నాణ్యత ఏమిటన్న అంశాలపై విద్యాశాఖ అభిప్రాయ సేకరణ చేపడుతోంది. జిల్లాలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ప్రధానోపా ధ్యాయులు, విద్యాశాఖ వాట్సాప్‌ల ద్వారా ఫార్మాట్‌ను నింపాలని ఆదేశించింది. స్టూడెంట్స్ కిట్స్-5 ఫీడ్‌బ్యాక్ ఫామ్ పేరుతో ఇంటర్నెట్ ద్వారా సర్వే చేపట్టింది. ఆయా లింక్‌లను అన్ని పాఠశాలల ఉపాధ్యాయులకు పంపించి పూర్తి వివరాలను సేకరిస్తున్నారు.



**నాణ్యత గురించి చెప్పనవసరం లేదు..**

గత వైసీపీ ప్రభుత్వం జగనన్న విద్యా కానుక పేరుతో ఇచ్చిన స్టూడెంట్స్ కిట్స్ నాణ్యత గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదని ఉపాధ్యాయు లు అంటున్నారు. ప్రతి ఏడాది వారు ఇచ్చిన ఏకరూప దుస్తులు రంగులు వెలిసిపోవడం, నెలవ్య వధిలోనే చినిగిపోవడంతో వాటిని ధరించడంలేదు. బ్యాగులైతే ఇచ్చిన రెండు నెలలకే మూలకు చేరడం, షూలు ఏమాత్రం సరిపోకపోవడం, సైజుల్లో తేడాలు రావడం, వాటిని సరిదిద్దమని వెనక్కు పంపితే ఏడాది పొడవునా రాకపోవడం లాంటి పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ఏ మాత్రం నాణ్యత లేని స్టూడెంట్స్ కిట్స్‌పై కూటమి ప్రభుత్వం దృష్టి సారిం చింది. అందరి అభిప్రాయ సేకరణ పూర్తి చేసి దుస్తుల రంగులు మార్చడంతోపాటు బ్యాగుల పరిణామం, నాణ్యత కలిగిన షూలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

**అస్తవ్యస్తంగా కిట్స్**

కొలతలు ప్రకారం పంపాల్సిన ఏకరూప దుస్తులను అరకొరగా అందించడంతో మూడు జతలు ఇవ్వాల్సిన వస్త్రం దుస్తులు కుట్టేసరికి రెండు జతలకే సరిపోతున్నది. బూట్ల కోసం ఉపాధ్యాయులు శ్రమించి స్కేలుతో విద్యార్థుల వారీగా కచ్చితమైన కొలతలు ఇచ్చినా కూడా ఒక్క ఏడాది కూడా సరిపడా సైజులు ఇచ్చిన సందర్భాలు లేవు. ఈ సమస్యలను అధిగమించి నాణ్యతతో కూడిన కిట్లను అందించడానికి కూటమి ప్రభుత్వం ప్రస్తుతం సర్వే ప్రారంభించింది. ప్రధానోపాధ్యాయులంతా ఫీడ్ బ్యాక్ సర్వే పత్రాలు అందుకున్న వెంటనే వారి అభిప్రాయాలతో అంతర్జాలంలో వెంటనే తిరిగి సమర్పిస్తున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

# టీడీపీలోకి బుచ్చి చైర్‌పర్సన్

- ఆమెతోపాటు ఆరుగురు కౌన్సిలర్లు కూడా..
- పార్టీలోకి ఆహ్వానించిన మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు
- 'దేశం'వశమైన నగర పంచాయతీ



నెల్లూరులో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి, అబ్దుల్ అజీజ్ సమక్షంలో టీడీపీలో చేరిన చైర్‌పర్సన్ సుప్రజ, కౌన్సిలర్లు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 22 : బుచ్చి నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజతోపాటు ఆరుగురు వైసీపీ కౌన్సిలర్లు ఆదివారం సైకిలెక్కారు. సుప్రజ, మురళి దంపతులతోపాటు కౌన్సిలర్లు కత్తి నాగరాజు, పఠాన్ నస్రీన్, రాచూరి సత్యం, చీర్ల ప్రసాద్‌యాదవ్, రహమత్, శ్రీదేవిలకు మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ, నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎంపీ వీపీఆర్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి నారాయణ మాట్లాడుతూ వీరి చేరికతో బుచ్చి నగర పంచాయతీ టీడీపీ వశమైందన్నారు. చైర్‌పర్సన్ సుప్రజ మాట్లాడుతూ నిధుల లేమితో అభివృద్ధికి నోచుకోని నగర పంచాయతీని రానున్న ఐదేళ్లలో మంత్రి నారాయణ సహకారంతో ప్రగతిపథంలో దూసుకెళ్తుందని ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు అబ్దుల్ అజీజ్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలపై కన్ను

- భూముల పంపిణీపై విచారణకు ప్రభుత్వం ఆదేశం
- ఫ్రీహోల్డ్ భూములపై లోతుగా ఎంక్వైరీ
- నేరుగా రంగంలోకి జేసీ, ఆర్డీవోలు
- గతంలో గ్రామసభలు లేకుండానే జాబితా సిద్ధం
- పేదల మాటున వైసీపీ నేతలకు దోచిపెట్టిన వైనం



భూపంపిణీలో అవకతవకలపై పొదలకూరు తహసీల్దార్ కార్యాలయంలో విచారణ జరుపుతున్న జేసీ కార్తీక్ (ఫైల్)

నెల్లూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూఅక్రమాల డొంక కదులుతోంది. నాడు అధికారమే పరమావధిగా ప్రభుత్వ భూములను దోచిపెట్టారు. భూములున్న వ్యక్తులకు కూడా పేదల మాటున ధారాదత్తం చేశారు. చెరువు, కాలువ, కొండ పోరంబోకు భూములను కూడా కట్టబెట్టారు. ఫ్రీహోల్డ్ పేరుతో వేల ఎకరాల ప్రభుత్వ భూములను నిషేధిత జాబితాలో నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు జరిపారు. నిబంధనలకు విరుద్ధంగా 22-ఏ నుంచి భూములను తొలగించి వైసీపీ నేతలకు కట్టబెట్టినట్లు మొదటి నుంచీ ఆరోపణలున్నాయి. అసలు గ్రామసభలు లేకుండానే భూపంపిణీ, ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించడంతో ఆరోపణలకు మరింత బలం చేకూరింది. అప్పట్లోనే ఈ అక్రమాలపై అనేక ఫిర్యాదులు అందినా నాటి మంత్రులు, ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో ఉన్నతాధికారులు మిన్నకుండిపోయారు.

కానీ ఇప్పుడు ప్రభుత్వం మారడంతో భారీగా ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఇప్పటికే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్లు నిలుపుదల చేసిన ప్రభుత్వం, తాజాగా అసలు నిబంధనల ప్రకారం ఈ భూములకు ఫ్రీహోల్డ్ కల్పించారా..? అన్నది విచారించి నివేదిక ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులను ఆదేశించింది. అదే సమయంలో అసైన్‌మెంట్ భూముల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఎమ్మెల్యేల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించింది.

**విచారణ ప్రారంభం**

గత ప్రభుత్వంలో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించి 22-ఏ జాబితా నుంచి తొలగించిన భూములపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాక రిజిస్ట్రేషన్లు జరిగిన భూములను తొలుత పరిశీలిస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన డేటాను జిల్లా ఉన్నతాధికారులు తెప్పించారు. జేసీ కార్తీక్‌తో పాటు ఆర్డీవోలు ప్రత్యక్షంగా ఈ విచారణలో పాల్గొంటున్నారు. విచారణకు సంబంధించిన గైడ్‌లైన్స్‌ను భూపరిపాలన విభాగం జిల్లా అధికారులకు పంపింది. కాగా అసైన్‌మెంట్ భూముల పంపిణీలో అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యేల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. చెరువు, కొండ కాలువ పోరంబోకు భూములను కూడా అసైన్‌మెంట్ పేరుతో కట్టబెట్టినట్లు ఆ ఫిర్యాదుల్లో పేర్కొన్నారు. ఈ క్రమంలో ఫ్రీహోల్డ్ భూములతో పాటు అసైన్‌మెంట్ భూములను కూడా ఏక కాలంలో విచారణ జరుపుతున్నారు. ఇప్పటికే కొన్ని చోట్ల అక్రమ వ్యవహారాలు వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది.

**పేదల మాటున దోచిపెట్టారు**

అసైన్‌మెంట్ పట్టాల పంపిణీ గతేడాది నవంబ రులో జరిగింది. అంతకు ఆరునెలల ముందు నుంచే అర్హుల జాబితా సిద్ధం చేయడం మొదలైంది. మూడు వర్గాల వారికి పట్టాలు పంపిణీ చేశారు. భూమి లేని నిరు పేదలు ఎవరైతే ప్రభుత్వ భూములను సాగు చేసు కుంటున్నారో వారితో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని నిరుపేదలకు పంపిణీ చేయడం మొదటిది కాగా, ఇనాం భూములను సాగు చేసుకుంటున్న కులవృత్తుల వారికి పట్టాలు అందించడం రెండోది. ఇక ఎవరైతే అసైన్‌మెంట్ పట్టాలు పొంది ఇరవైఏళ్లు పూర్తి చేసుకున్నారో వారికి ఆ భూమిపై పూర్తి హక్కులు కల్పిస్తూ నిషేధిత జాబితా(22-ఏ) నుంచి తొలగించడం మూడోది. ఇలా జిల్లాలో ఈ మూడు విభాగాల్లో సుమారు 40 వేల ఎకరాలకు పట్టాలు పంపిణీ చేశారు. ఇందులో దాదాపు ఎనిమిది వేల ఎకరాల ప్రభుత్వ భూమిని అసైన్‌మెంట్ కింద పేదలకు పంపిణీ చేశారు.

> సీసీఎల్‌ఏ ఆదేశాల ప్రకారం ఫ్రీహోల్డ్ జరిగి నిషేధిత జాబితాలో నుంచి తొలగించిన భూములపై విచారణ జరుపుతున్నాం. నిబంధనల ప్రకారం అర్హులకు ఫ్రీహోల్డ్ కల్పించారా..లేదా..? అన్నది పరిశీలిస్తున్నాం. ఇప్పటికే రిజిస్ట్రేషన్లు జరిగిపోయిన భూములపై తొలుత విచారణ చేస్తున్నాం. అసైన్‌మెంట్ భూముల పంపిణీలో అవకతవకలు జరిగినట్లు ఎమ్మెల్యేల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి. వాటిపై కూడా విచారణ చేయిస్తున్నాం.
>
> - కే కార్తీక్, జాయింట్ కలెక్టర్

**విచారణ జరుపుతున్నాం**

**గ్రామసభలు లేకుండానే..**

నిబంధనల ప్రకారం భూమి లేని నిరుపేదలకు భూమి ఇవ్వాలంటే ముందుగా గ్రామసభలు పెట్టాల్సి ఉంది. ఆ గ్రామంలోని భూమిని తొలుత ఆ గ్రామంలోని భూమి లేని వారికి పంపిణీ చేయాలి. వారికిపోను మిగిలితేనే ఇతర ప్రాంతాల వారికి ఇవ్వాల్సి ఉంది. అలానే భూమి ఉన్న వారికి కొత్తగా భూమి ఇవ్వకూడదు. అయితే చాలా చోట్ల ఇతర ప్రాంతాల వారికి, భూమి ఉన్న వారికి అసైన్‌మెంట్ పట్టాలు ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. భూస్వాములకు కూడా పేదల కింద చూపించి భూములు ధారాదత్తం చేసినట్లు ఎమ్మెల్యేలే ఫిర్యాదులు చేస్తున్నారు. వీరిలో అత్యధికులు వైసీపీ నాయకులే ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా అసైన్‌మెంట్ కమిటీలో అర్హుల జాబితాను ఆమోదించినట్లు చెబుతున్నా నాడు అసైన్‌మెంట్ కమిటీ సమావేశాలు ఎక్కడా కూడా ప్రత్యక్షంగా జరగకపోవడం గమనార్హం.

**ఫ్రీహోల్డ్ మాటున..**

వైసీపీ ప్రభుత్వం గ్రామ సభలు లేకుండానే అసైన్‌మెంట్ పట్టాల పంపిణీతో పాటు ఫ్రీహోల్డ్ హక్కులను కల్పించింది. చుక్కల భూముల మాటున ప్రభుత్వ భూములను కూడా ఆ జాబితా నుంచి తొలగించి భారీ భూకుంభకోణాలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఒక వ్యక్తికి అసైన్‌మెంట్ పట్టా ఇస్తున్నా లేక 20 ఏళ్లు దాటిన వారికి ఫ్రీహోల్డ్ హక్కు కల్పిస్తున్నా ముందుగా గ్రామసభ నిర్వహించాల్సి ఉంది. అప్పుడే నిజమైన అర్హులకు న్యాయం జరుగుతుంది. కానీ అలా కాకుండా గోప్యంగా ఈ ప్రక్రియలు గత ప్రభుత్వంలో జరిగాయి. 20 ఏళ్లపాటు ఒరిజినల్ అసైనీదారులు సాగు చేయకపోయినా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు. అసైనీదారుల పేరు కలిగిన మరో వ్యక్తిని తీసుకొచ్చి ఆ వ్యక్తినే ఒరిజినల్ అసైనీదారులుగా చూపించి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన సంఘటనలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇలా ఫ్రీహోల్డ్ కల్పించి నిషేధిత జాబితా నుంచి తొలగించగానే వెంటనే ఆ భూములను రిజిస్ట్రేషన్లు కూడా చేసినట్లు సమాచారం. ఇప్పటికే జిల్లాలో వందల ఎకరాల భూములు రిజిస్ట్రేషన్ జరిగిపోయినట్లు తెలుస్తోంది. అసలు ఏ గ్రామంలో ఎవరికి భూపంపిణీ చేశారు..? ఎవరికి ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించారు..? అన్నది ఆయా గ్రామస్థులకు కూడా తెలియదు. అనేక ఫిర్యాదులు రావడంతో ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించిన భూముల రిజిస్ట్రేషన్లు నిలిపేయాలని రిజిస్ట్రేషన్ శాఖను ఆదేశించింది.

# నాణ్యతకు నామం

ప్రపంచవ్యాప్తంగా తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం పవిత్రతపై చర్చ సాగుతున్నది. లడ్డూను అపవిత్రం చేసిన దోషులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ రోజురోజుకు పెరుగుతున్నది. మరోవైపు సంప్రోక్షణ లేక శుద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆగమశాస్త్ర పండితులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆలయాల్లో అందిస్తున్న ప్రసాదాలపై భక్తులు చర్చకు తెరలేపారు. ఇంతకుముందు ప్రసాదాల నాణ్యత ఎలా ఉండేది ? ఇప్పుడు ఎలా ఉందంటూ బేరీజు వేసుకుంటూ స్థానిక ఆలయాల్లో కూడా ప్రక్షాళన జరగాలని కోరుతున్నారు. ప్రసాదాల నాణ్యతపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని ఆశిస్తున్నారు.



- ప్రసాదాలపై పర్యవేక్షణ కరువు
- జిల్లాలో 4 ఆలయాల్లోనే లడ్డూ విక్రయం
- మిగతాచోట్ల పులిహోర పొట్లాల అమ్మకం
- అవి కూడా నాసిరకమే..
- రుచిలేదంటున్న భక్తులు
- ఈవోల ఇష్టారాజ్యంగా తయారీ



నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 22: దేవుడంటే భక్తులకు ఎంత భక్తి ఉందో.. ఆయా ఆలయాల్లో విక్రయించే ప్రసాదాలపై కూడా అంతే భక్తి ఉంటుంది. దైవదర్శనం తరువాత దేవాలయాల్లో లడ్డూ, పులిహోర, చక్కెర పొంగళి, కట్టె పొం గళి, దద్దోజనం, గుగ్గిళ్లు వంటి ప్రసాదాల కోసం భక్తులు బారులుతీరు తారు. అలా అందుకున్న ప్రసాదాన్ని కుటుంబసభ్యులు, బంధు మిత్రులకు పంచిపెట్టి ఆత్మానం దం పొందుతారు. అయితే జిల్లాలోని వందలాది ఆలయాల్లో కేవలం నాలుగు ఆలయాల్లోనే లడ్డూ ప్రసాదం విక్రయిస్తున్నారు. అది కూడా నాసిరకమేనని భక్తులు పెదవి విరుస్తున్నారు. పులిహోర ప్రత్యేక సందర్భాల్లో అందుబాటులో ఉంటుంది. మిగతా ప్రసాదాలు పండుగ, ఇతర పర్వదినాల్లోనే మాత్రమే పంపిణీ చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఆలయ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడరు.

**వేణుగోపాలుడి ప్రసాదం ప్రసిద్ధి**

కాగా నెల్లూరు మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో ప్రసాదాలు అంటే జిల్లా వ్యాప్తంగా భక్తులు తలచుకునేవారు. ఆ రుచిని గురించి ప్రత్యేకంగా చెప్పుకునేవారు. ప్రస్తుతం ఆ ఆలయం ప్రసాదాల్లో కూడా రుచి ఉండడంలేదు. నేడు జిల్లాలో చెప్పుకోదగిన స్థాయిలో ఏ ఆలయంలో కూడా ప్రసాదాలు ఉండటం లేదు. దీనికి కారణాలు అనేకం.

**నాణ్యతను పట్టించుకునేవారేరి ?**

జిల్లాలో ప్రస్తుతం లడ్డూ ప్రసాద విక్రయం పెంచలకోన లక్ష్మీనరసింహస్వామి, వేదగిరి లక్ష్మీనరసింహస్వామి, జొన్నవాడ కామాక్షితాయి, నర్రవాడ వెంగమాంబ పేరంటాల ఆలయాల్లో మాత్రమే వారానికి రెండు మూడు రోజులు జరుగుతుంది. మిగతా ఆలయాల్లో పులిహోర పొట్లాలు మాత్రమే విక్రయిస్తారు. అయితే వీటి నాణ్యత, పరిమాణాలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

**నాసిరకమే దిక్కు**

ఆగమశాస్త్రాల ప్రకారం ప్రతి ఆలయంలో నిత్య కైంకర్యాలతో పాటు ప్రసాదాల తయారీకి దేవదాయ, ధర్మాదాయ శాఖ నిర్దిష్ట విధానం రూపొందించింది. దీన్ని దిట్టం అని పిలుస్తారు. ప్రతి ఆలయంలో దేవుళ్ల నైవేద్యానికి , భక్తుల ప్రసా దం కోసం ఈ దిట్టంను ఏర్పాటు చేశారు. అలాగే లడ్డూ ప్రసాదానికి, ఇతర ప్రసాదాలకు దిట్టంలు వేర్వేరుగా ఉన్నాయి.అయితే నేడు ఎక్కువమంది ప్రజాప్రతినిధులకు, ధర్మకర్తలకు, దేవదాయ శాఖ అధికారులకు దేవుడన్నా, భక్తులన్నా చులకన భావం ఉండటంతో ఆలయాలు ప్రతిష్ఠను కోల్పోతున్నాయి. భక్తులకు నాసిరకం ప్రసాదాలే దిక్కవుతున్నాయి. దేవుళ్లకు రోజూ నైవేద్యానికి ఇచ్చే దిట్టంలో కూడా ఆలయ ఈవోలు కోత పెట్టుతున్నారని అర్చకులు ఉన్నతాధికారులకు మొరపెట్టుకుంటూనే ఉన్నారు. కానీ యథాతథంగా దిట్టంలో కోత విధిస్తూనే ఉన్నారు. ఈ విషయంలో ఆయా ఆలయాల ఈవోల చేతివాటానికి అడ్డూ అపూ లేకుండా ఉందనే విమర్శలు ఉన్నాయి. గతంలో దేవదాయశాఖ మంత్రిగా దండు శివ రామ రాజు ఉన్నప్పుడు ఈ శాఖలో సంస్కరణలు, ఆలయ భూముల పరిరక్షణ, దేవుళ్ల నైవేద్యాలకు ఇచ్చే దిట్టం, ఇతర ప్రసాదాల దిట్టంపై సమీక్షలు జరిగాయి. వీటిని చాలాచోట్ల పక్కాగా అమలు చేశారు. ఆ తర్వాత వచ్చిన మంత్రులు కానీ, దేవదాయ శాఖ కమిషనర్లు కానీ వాటిని పట్టించుకోవడంలేదు. గత ప్రభుత్వంలో అధికారులతో పాటు పాలక మండళ్లు కూడా ఆలయాల ప్రతిష్ఠను కాపాడలేదు. ఆధ్యాత్మిక విలువలకు, ఆస్తులకు గత పాల కులు పంగనామాలు పెట్టారు. రాజకీయ నిరుద్యోగులకు ఆలయాల పదవులను అప్పగించారు.

**నిబంధనలకు తిలోదకాలు**

నిబంధనల ప్రకారం ఆలయాల ఆధ్వర్యంలో లడ్డూ, ఇతర ప్రసాదాలు తయారు చేయాలి. చాలా దేవాలయాల్లో ఈవోలు బయటి వ్యక్తులకు కాంట్రాక్టు ద్వారా ప్రసాదాలను తయారు చేయిస్తున్నారు. దీంతో నాణ్యత డొల్లగా ఉంది.

## హిందువుల మనోభావాలు దెబ్బతీసిన వారిని ఉరితీయాలి

**జగన్, వైవీ దిష్టిబొమ్మలను దహనం చేసిన టీడీపీ నాయకులు**



నెల్లూరురూరల్ : ఆ దేవదేవుని లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైసీపీ ప్రభుత్వం తీరుపై లోతైన దర్యాప్తు జరిపి, అందుకు కారకులను ఉరితీయాలని టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని రెండో డివిజన్ పరిధి సిరిగార్డెన్స్ వద్ద మాజీ సీఎం జగన్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీసుబ్బారెడ్డిల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా టీడీపీ సీనియర్ నేత పోలూరు సుబ్బయ్య మాట్లాడుతూ తిరుమల లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు కలిపినట్లు పరిశోధనల్లో బహిర్గతం కావడంతో యావత్ హిందుసమాజం ఆందోళన చెందుతుందన్నారు. జరిగిన అపచారంపై దర్యాప్తు చేసి, కారకులను న్యాయస్థానంలో నిలబెట్టి ఉరిశిక్ష పడేలా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పోలూరు సురేంద్ర, వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# అయ్యో.. దేవుడా..!

- పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి
- ఏడుగురికి గాయాలు
- మృతులు, క్షతగాత్రులు కాకుపల్లి, వనంతోపు వాసులే..

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ కుటుంబం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమయ్యారు. మరో అరగంటలో గమ్యం చేరనున్న క్రమంలో చిల్లకూరు వద్ద అదుపు తప్పిన వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన ముగ్గురు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు. పోలీసులు కథనం మేరకు, నెల్లూరురూరల్ మండలం కాకుపల్లికి చెందిన గోనెల బాబు(50), అతడి భార్య లక్ష్మమ్మ చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి కిషోర్‌బాబు, కళ్యాణి, మాధవి పిల్లలు. వీరిలో కళ్యాణి నెల్లూరులోని వనంతోపులో ఉండగా, ఆమెకు వెన్నెల మేఘన(8), జశ్వంత్ పిల్లలు. ఈ కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువు రాధాకుమారి, నెల్లూరుకే చెందిన బాబు కుటుంబ స్నేహితులైన సునీల్‌కుమార్, జగదీశ్వర్(45) కలిసి ఈనెల 18న పుణ్యక్షేత్రాల సందర్శనకు సునీల్‌కుమార్ కారులో వెళ్లారు. కాణిపాకం, కంచి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వేకువన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చే సమయానికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనరు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాత, మనవరాలైన బాబు, వెన్నెల మేఘన, జగదీశ్వర్ మృతిచెందారు. లక్ష్మమ్మ, మాధవి, కళ్యాణి, కిషోర్‌బాబు, రాధాకుమారి, సునీల్‌కుమార్, జశ్వంత్‌లకు గాయాలయ్యాయి. వీరికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని తిరుపతి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఎస్‌ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



మృతి చెందిన బాబు, జగదీశ్వర్

మృతిచెందిన వెన్నెల మేఘన

ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు

**విషాద ఛాయలు**

నెల్లూరు(క్రైం) : తిరుపతి జిల్లా చిల్లకూరు జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నెల్లూరులోని వనంతోపు, కాకుపల్లి ప్రాంతాలకు చెందిన ముగ్గురు దుర్మరణం చెందారు. దీంతో ఆయా ప్రాంతాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## బోరు ఇలా.. నీరు ఎలా ?



ఈ చిత్రంలో ఉన్న బోరు మర్రిపాడు గ్రామంలోని ఎస్టీ కాలనీలో ఉంది. కాలనీలో సుమారు వంద కుటుంబాలున్నాయి. ఈ బోరు చాలారోజుల కిందట మరమ్మతులకు గురైంది. ఈనేపథ్యంలో కాలనీలో జలజీవన్ మిషన్‌లో బోరుపాయింట్ వేసి ఇంటింటికీ కుళాయి వేశారు. జలజీవన్ మిషన్‌కు కుళాయిలకు డైరెక్ట్ సరఫరా కావడంతో విద్యుత్ సరఫరా ఉంటేనే కుళాయిలకు నీరు సరఫరా అవుతాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే ఆరోజు కుళాయిలకు నీరు సరఫరా కావడం లేదు. కాలనీలో ఉన్న ఒక్క బోరు మరమ్మతులకు గురవ్వడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. - సంగం

## ఎస్టీ వర్గీకరణకు ఉద్యమం

● యానాది సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ

**నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 22 :** ఎస్టీ వర్గీకరణ కోసం ఉద్యమం చేయాలని యానాది సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ తీర్మానించింది. నెల్లూరులోని గిరిజన భవన్‌లో యానాది సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సమావేశం ఆదివారం జరిగింది. ఈ రాష్ట్రంలోని అన్నీ జిల్లాలకు చెందిన యానాది సంఘాల నాయకులు హాజరయ్యారు. పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. వచ్చే నెల విజయవాడలో సమావేశమై ఉద్యమ కార్యాచరణ ప్రకటించాలని నిర్ణయించారు. అన్నీ విధాలా వెనుకబడి ఉన్న యానాదులకు వర్గీకరణ ద్వారా మాత్రమే న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు. దీనిపై యానాది కాలనీల్లో విస్తృత ప్రచారం చేసి యానాదులను ఉద్యమానికి సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఉద్యమ కార్యాచరణ కోసం త్రీమెన్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కన్వీనర్లుగా కేసీ పెంచలయ్య, కుడుముల రామచంద్రయ్య, బాపట్ల వెంకటపతిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలశెట్టి శ్రీనివాసులు, చేవూరు సుబ్బారావు, సరస్వతమ్మ, ఉష తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం మారినా సీఎం జగనేనట !



కోవూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో కరోనా సమయంలో ఏర్పాటు చేసిన రంగుల చిత్రం

కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయ్యాయని 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఇంటింటా అధికారులు, టీడీపీ నాయకులు స్టిక్కర్లు అతికిస్తున్నారు. సీఎంగా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎంగా పవన్‌కల్యాణ్ సేవలందిస్తున్నారని ప్రచారం చేపట్టారు. అయితే నియోజకవర్గ కేంద్రమైన కోవూరు తహసీల్దారు కార్యాలయ ఆవరణలోని మండల విద్యావనరుల కేంద్రం గోడకు సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోతో కరోనా సమయంలో ఏర్పాటుచేసిన రంగుల చిత్రాన్ని మాత్రం అధికారులు తొలగించలేదు. దాన్ని తొలగించాలంటే వారు భయపడిపోతున్నారు. - కోవూరు

## చెర్లోపల్లిలో డీఎస్పీ విచారణ



చెర్లోపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు

**మనుబోలు, సెప్టెంబరు 22:** మండలంలోని చెర్లోపల్లిలో ఆదివారం ఎస్సీ, ఎస్టీ కేసుపై నెల్లూరు రూరల్ డిఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. పోలీసుల కథనం మేరకు... ఈనెల 14వ తేదీన చెర్లోపల్లిలో జరిగిన గణేష్ గ్రామోత్సవంలో తనను కొంతమంది కులం పేరుతో దూషించారంటూ గ్రామానికి చెందిన సుమన్‌తేజ 20వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనితో డిఎస్పీ గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. వివాదానికి గల కారణాలను ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రాకేష్, వీఆర్వో వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

## లారీ ఢీకొని దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు



లారీ ఢీకొట్టడంతో దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు

**సంగం, సెప్టెంబరు 22:** మండల పరిధిలోని ముంబయి జాతీయ రహదారిలో ఎస్వీఆర్ పురం మలుపు వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న సంఘటన ఆదివారం ఉదయం జరిగింది. వివరాల మేరకు.. ఆత్మకూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుచ్చిరెడ్డిపాళెం వైపు వెళ్తుండగా మార్గమధ్యంలో ఎస్వీఆర్ పురం మలుపులో ఎదురుగా వస్తున్న లారీ అదుపుతప్పి బస్సును రాసుకుంటూ వెళ్లింది. దీంతో బస్సు రెండు అద్దాలు పగలడంతోపాటు బాడీ దెబ్బతింది. దీంతో బస్సులోని ప్రయాణికులను నెల్లూరు వెళ్లే వేరే బస్సులో ఎక్కించారు. ఢీకొన్న లారీపై ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## మోటారు బైక్ స్వాధీనం: యువకుల పరారీ



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటారు బైక్

**సంగం, సెప్టెంబరు 22:** బీట్‌లో ఉన్న పోలీసులను చూసి మోటారుబైక్‌లపై వెనుతిరిగిన యువకులను వెంబడించడంతో మోటారుబైక్‌ను వదిలి పరారైన సంఘటన సంగంలో శనివారం రాత్రి జరిగింది. దీంతో పోలీసులు మోటారు బైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల సంగంలో తాళాలు వేసిన ఇళ్లలో వరుసగా చోరీలు జరిగాయి. దీంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీఐ వేమారెడ్డి రాత్రి బీట్ పోలీసుల నిఘా పెంచారు. అందులో భాగంగా స్థానిక బ్యారేజీ వద్ద ఇద్దరు పోలీసులు అటువైపు వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈక్రమంలో నలుగురు యువకులు రెండు మోటారు బైక్‌లపై బ్యారేజీ వైపు వస్తూ పోలీసులను గమనించి సంగం వైపు వెనుతిరిగారు. అనుమానం వచ్చిన పోలీసులు వారిని వెంబడించారు. ఒక బైక్ నేరుగా బస్టాండ్ మీదుగా వెళ్ల గా, మరో బైక్ రెడ్డిగారి వీధి వైపు వెళ్లింది. దీంతో పోలీసులు వెంబడించగా మోటారు బైక్‌ను నిలిపి తాళం తీసుకుని పరారయ్యారు. పరారైన యువకుల కోసం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు మోటారుబైక్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. మోటారుబైక్ ఎవరిదనేది తెలిస్తే యువకుల ఆచూకీ తెలుస్తుందని పోలీసులు ఆరా తీస్తున్నారు.

## కోడి పందేల స్థావరంపై దాడి

● 12మంది అరెస్ట్ ● 4కోళ్లు, రూ.15,400 నగదు స్వాధీనం



పందెం రాయుళ్లను అదుపులోకి తీసుకున్న పోలీసులు

**కావలి రూరల్, సెప్టెంబరు 22:** రాజువారి చింతలపాలెం, పెద్దారం గ్రామాల మధ్యన ఉన్న అటవీ ప్రాంతంలో ఆదివారం చేపట్టిన కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. వచ్చిన సమాచారం మేరకు సీఐ రాజేశ్వరరావు ఎస్ఐ బాజిబాబు, సిబ్బందితో కలిసి ఆ ప్రాంతానికి వెళ్లారు. పందేలు ఆడుతున్న 12మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 4 కోళ్ళ, రూ.15,400ల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజేశ్వరరావు తెలిపారు. అలాగే మండలంలో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట, గంజాయి అమ్మకాలు జరిపితే సమాచారం అందజేయాలని కోరారు.

## ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ : పలువురికి తీవ్ర గాయాలు



ఉదయగిరి వైద్యశాలలో చికిత్స పొందుతున్న సుబ్బమ్మ



తీవ్ర గాయాలపాలైన నాగవేణి

**దుత్తలూరు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 22:** ఆర్టీసీ బస్సు, ఆటో ఢీకొనడంతో పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన దుత్తలూరు గ్రామ సమీపంలోని సచివాలయం వద్ద ఆదివారం చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని మందాలనాయుడు పల్లి నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటో దుత్తలూరు సచివాలయం వద్దకు రాగానే అదుపుతప్పి ప్రకాశం జిల్లా పామూరు నుంచి నెల్లూరు వెళుతున్న ఆర్టీసీ బస్సును ఢీకొంది. ఈప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నాగవేణి, సుబ్బమ్మ, పెంచలమ్మ, హరిణి, మరికొందరికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని వెంటనే చికిత్స నిమిత్తం 108 వాహనంలో ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పెంచలమ్మ, హరిణిలకు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ ఆదిలక్ష్మి పరిశీలించి వివరాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

### చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

| | కిలో |
|---|---|
| బాయిలర్ లైవ్ | 123 |
| లేయర్ లైవ్ | 115 |
| స్కిన్ చికెన్ | 224 |
| స్కిన్‌లెస్ | 246 |
| లేయర్ | 195 |

### బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

| | |
|---|---|
| ఒక గ్రాము ధర | రూ.7160 |
| వెండి కిలో ధర | రూ. 91,400 |
| వెండి ఒక గ్రాము | రూ. 94.40 |

## పాత నేరస్థుడి అరెస్టు

● ఆటో, బైక్ స్వాధీనం

**నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22 :** వాహనాల చోరీకి పాల్పడుతున్న పాత నేరస్థుడిని బాలాజీనగర్ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు... నెల్లూరులోని జగదీష్ నగర్ బ్యాంకు కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్ వద్ద పార్కు చేసి ఉన్న ఆటో ఈనెల 16వతేదీన అపహరణకు గురైంది. ఆటో యజమాని ఫిర్యాదు మేరకు బాలాజీనగర్ పోలీసులు అప్పట్లో కేసు నమోదు చేశారు. ఘటనా స్థలంలో లభించిన సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా నిందితుడు పాత నేరస్థుడైన కొత్తూరు రామకోటయ్య నగర్‌కు చెందిన షేక్ హుస్సేన్ అలియాస్ ఉస్మాన్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిని ఆదివారం అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా ఆటోపాటు గౌడ హాస్టల్ సెంటర్‌లో మోటారు బైక్‌ను దొంగలించినట్లు అంగీకరించాడు. దీంతో నిందితుడిని అరెస్టు చేసి ఆటో, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితునిపై బాలాజీనగర్ పోలీసు స్టేషన్‌లో సస్పెక్టడ్ షీట్ ఉందని స్థానిక ఇన్‌స్పెక్టర్ కే సాంబశివరావు తెలిపారు.

## ముగ్గురు పందెంరాయుళ్ల అరెస్టు

● ఆరు కోడి పుంజులు, ఆరు బైక్‌ల స్వాధీనం

**కోవూరు, సెప్టెంబరు 22:** మండలంలోని గుమ్మళ్లదిబ్బ కాలనీ సమీపంలో కోడి పందాలు నిర్వహిస్తున్న స్థావరంపై ఆదివారం సీఐ సుధాకర్‌రెడ్డి, ఎస్ఐ రంగనాథ్‌గౌడ్, పోలీసు సిబ్బంది దాడి చేసి ముగ్గురు పందెపు రాయుళ్లను అరెస్టు చేశారు. వారి నుంచి ఆరు కోడి పుంజులు, ఆరు మోటారు బైక్‌లు, ఓ ఆటోను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అద్దె ఇళ్లలో అంగన్‌వాడీలు

● కొనసాగుతున్న భవన నిర్మాణాలు
● ఇక్కట్లలో చిన్నారులు, గర్భిణులు, బాలింతలు



ఉదయగిరి మండలం బోడబండలో అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

**ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 22:** అంగన్‌వాడీ కేంద్రాలు అసౌకర్యాలకు చిరునామాగా మారాయి. శిథిలమైన, వినియోగానికి దూరంగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోనూ, అద్దె ఇళ్లలోనూ ఈ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులతోపాటు గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు పథకం కింద గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన భవన నిర్మాణాలు నత్తను మరిపిస్తున్నాయి.దీంతో లబ్ధిదారులకు కష్టాలు తప్పడంలేదు. కొన్నిచోట్ల కేంద్రాలకు పిల్లలను పంపడానికే తల్లిదండ్రులు భయపడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి.

● **నిర్మాణాలకు నిధుల లేమి**

ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని సీతారామపురం, దుత్తలూరు, ఉదయగిరి, వరికుంటపాడు మండలాల్లో 208 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, వాటిలో సుమారు 75 కేంద్రాలు అద్దె, ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం రెండో విడతలో ఒక్కో కేంద్రం నిర్మాణానికి రూ.13.50 లక్షల చొప్పున కేటాయిస్తూ 12 చోట్ల భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. అయితే నిధుల లేమితో పనులు నత్తను తలపిస్తున్నాయి. సీతారామపురం మండలంలో భవనాల పనులు 80 శాతం పూర్తి కాగా, మిగిలిన మండలాల్లో అరకొరగా సాగుతున్నాయి. భవన నిర్మాణాలు ఏళ్ల తరబడి కొనసాగుతుండడంతో అద్దె భవనాల్లో అంగన్‌వాడీల నిర్వహణ కార్యకర్తలకు తలకుమించిన భారంగా మారింది. అద్దె భవనాల్లో కనీస వసతులు లేకపోవడంతో కేంద్రాలకు చిన్నారులు, గర్భిణులు, బాలింతలు వచ్చేందుకు సముఖత చూపడం లేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వమైనా త్వరితగతిన భవనాలు పూర్తి చేసి తమ కష్టాలు తీర్చాలని పలువురు అంగన్‌వాడీలు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం**

భవన నిర్మాణాల సమస్యను ఉన్నతాధికారులతోపాటు ఇంజనీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. కొన్ని భవనాల పనులు 80 శాతం పూర్తయ్యాయి. త్వరలో మిగిలిన పనులు పూర్తి చేసి, కేంద్రాలను అందులో నిర్వహించేలా చర్యలు చేపడతాం.

- పచ్చవ లావణ్య, సీడీపీవో, ఉదయగిరి

## చెస్ సాధనతో యువతకు మేధో సంపత్తి

● డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి

**నెల్లూరు (విద్య), సెప్టెంబరు 22 :** యువత తమ ఆలోచనలను కేంద్రీకరించేందుకు, మేధోసంపత్తిని పెంపొందించుకునేందుకు చెస్ క్రీడ సాధన చేస్తే ఫలితాలుంటాయని రేడియాలజిస్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి తెలిపారు. నగరం లోని మైపాడుగేటు సెంటర్‌లో గల ఓ కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన అఖిల భారత ఓపెన్ చెస్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పురాతన క్రీడ అయిన చదరంగంతో విజ్ఞానాన్ని పెంపొందించుకోచ్చని, ఎంతోమంది మేధావులు నిత్యం చదరంగంలో సాధన చేస్తుంటారన్నారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై సుమన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది నెల్లూరులో జాతీయస్థాయి పోటీలు నిర్వ హిస్తూ క్రీడాకారులను ప్రోత్సహిస్తు న్నామని తెలిపారు. ప్రస్తుత పోటీల్లో దేశ వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన ప్రపంచ చదరంగ సమాఖ్య టైటిల్ క్రీడాకారులు, అంతర్జాతీయ మాస్టర్, ఫిడే మాస్టర్, క్యాండిటేట్ మాస్టర్‌తో పాటు 170మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ క్రీడాకారులు, అగ్రశ్రేణి క్రీడాకారులు కలిపి 400 మందికిపైగా పాల్గొన్నారని తెలి పారు. ఈ కార్యక్రమంలో చెస్ సంఘం కృష్ణాజిల్లా కార్యదర్శి దేవరం శ్రీహరి, కడప జిల్లా కార్యదర్శి అనీస్, టోర్నీ డైరెక్టర్లు ఎస్ వెంకటేష్, డాక్టర్ మధుసూదన్‌రెడ్డి, వారధి ఫౌండేషన్ అధ్యక్షుడు రంగనాథ్, కార్యదర్శి ఆర్కాట్ శ్రీనివాసులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ ఉమామహేశ్వరరెడ్డి

## ఎస్ఈఐఎల్ ఎనర్జీకి రెండో ఉత్తమ అవార్డు




ఉత్తమ అవార్డు అందుకుంటున్న కంపెనీ యాజమాన్యం

**తోటపల్లిగూడూరు/ముత్తుకూరు, సెప్టెంబరు 22 :** భారత దేశంలో అతిపెద్ద స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థల్లో (ఐపీపీ) ఒకటైన ఎస్ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ (ఎస్ఈఐఎల్) పారాదీప్ పోర్ట్ అథారిటీ నుంచి 2వ ఉత్తమ ఎగుమతిదారు (కోస్టల్) అవార్డును అందుకుంది. భువనేశ్వర్‌లో ఆదివారం జరిగిన వేడుకల్లో కోల్ సోర్సింగ్ అండ్ లాజిస్టిక్స్ హెడ్ కెప్టెన్ పవన్‌కుమార్ ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కంపెనీ సీఈవో రాఘవ్‌త్రివేది మాట్లాడుతూ ఎస్ఈఐఎల్ నిర్వహించే ప్రతి రంగంలో శ్రేష్టత, నిబద్ధత, అంకితభావానికి ఈ అవార్డు నిదర్శనమని పేర్కొన్నారు. ఒడిశాలోని పారాదీప్ పోర్ట్ వ్యూహాత్మక ప్రదేశాన్ని ఎస్ఈఐఎల్ తన దేశీయ బొగ్గును ఎగుమతి చేయడానికి ఉపయోగించుకుంటుందని, ఈ బొగ్గు తిరిగి అదానీ కృష్ణపట్నం పోర్టులో దిగుమతి అవుతుందని తెలిపారు. పారాదీప్ పోర్ట్ అథారిటీ నుంచి ఈ అవార్డును గెలుచుకున్నందుకు గర్విస్తున్నామంటూ తమ సిబ్బందిని అభినందించారు.

## వరద బాధితులకు వాకర్స్ రూ.3లక్షల విరాళం



ఎమ్మెల్యేకు డీడీ అందచేస్తున్న వాకర్స్

**నెల్లూరు (విద్య), సెప్టెంబరు 22 :** వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయవాడ వరద బాధితుల సహాయ నిధికి రూ.3లక్షల డీడీని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అందచేశారు. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్ బాబు, కోశాధికారి కే జయదేవ్, నేతలు చింతల అమరేంద్ర రెడ్డి, పొన్నం రవిచంద్ర, డాక్టర్ కృష్ణమూర్తి, డాక్టర్ అంకిరెడ్డి, డాక్టర్ సత్యనాథ్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నేరస్థులపై కఠినంగా వ్యవహరించాలి : నగర డీఎస్పీ

**నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 22 :** నేరస్థులపై కఠినంగా వ్యవహరించి ప్రజలకు మెరుగైన శాంతి భద్రతలను అందించాలని నెల్లూరు నగర డీఎస్పీ డీ శ్రీనివాసరెడ్డి పోలీసు అధికారులకు సూచించారు. నగర ఇన్‌స్పెక్టర్లతో ఆదివారం ఆయన కార్యాలయంలో నెలవారీ సమీక్ష నిర్వహించారు. స్టేషన్ల వారీగా కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి సలహాలిచ్చారు. ప్రజాజీవనానికి, శాంతి భద్రతలకు భంగం కలిగించేవారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీపావళి సమీపిస్తున్న దృష్ట్యా రెవెన్యూ, అగ్నిమాపక శాఖలతో కలిసి బాణసంచా తయారీ కేంద్రాలు, గోదాములు, విక్రయ కేంద్రాల్లో విస్తృత తనిఖీలు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో నగర ఇన్‌స్పెక్టర్లు చిట్టెం కోటేశ్వరరావు, అన్వర్‌బాషా, మద్ది శ్రీనివాసరావు, రోశయ్య, కిషోర్ కుమార్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

### విజిటబుల్ ఆయిల్ విక్రయాలకు అనుమతివ్వాలి

**కావలి :** విజిటబుల్ ఆయిల్ లూజు అమ్మకాలకు ప్రభుత్వం అనుమతులు ఇవ్వాలని విజిటబుల్ ఆయిల్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సన్నపురెడ్డి పెంచలరెడ్డి కోరారు. ఆదివారం మధ్యాహ్నం కావలి ఆయిల్ డీలర్స్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డిని ఆయన నివాసంలో కలిసి సమస్యను విన్నవించారు. అసెంబ్లీ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి లూజ్ విక్రయాలపై ఆంక్షలు లేకుండా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూస్తానన్నారు.

## సజ్జ దిగుబడులు కొనుగోలు చేయాలి

● రైతుల ఆందోళన



కృష్ణారెడ్డిపల్లిలో ఆందోళన చేస్తున్న రైతులు

**ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 22:** రైతులు పండించిన సజ్జ దిగుబడులను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఆదివారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ సజ్జ పంట సాగుచేసిన రైతులకు ఈ ఏడాది దిగుబడి తగ్గడంతోపాటు బహిరంగ మార్కెట్‌లో ఆశించిన మేర ధర పలకడంలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతుసేవా కేంద్రాల ద్వారా మద్దతు ధరతో సజ్జ దిగుబడులను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేదంటే దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## కంటైనర్ టెర్మినల్ కోసం పోరాటం ఉధృతం



మాట్లాడుతున్న సీఐటీయూ నేత అజయ్‌కుమార్

**ముత్తుకూరు, సెప్టెంబరు 22 :** అదానీ కృష్ణపట్నం పోర్టులో కంటైనర్ టెర్మినల్ తిరిగి ప్రారంభించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో పోరాటాలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కటారి అజయ్‌కుమార్ హెచ్చరించారు. ఆదివారం సాయంత్రం ముత్తుకూరు ప్రధాన కూడలిలో సీఐటీయూ ఆధ్వర్యంలో కంటైనర్ టెర్మినల్ ఆధారిత ఉద్యోగులతో కలిసి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయ కులు మాట్లాడుతూ కంటైనర్ టెర్మినల్ తరలించడంతో వేలాది మంది ఉద్యోగులు, కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ తిరిగి తెచ్చేందుకు అధికార, విపక్షాలు కలిసిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు గోగుల శ్రీనివాసులు, గడ్డ అంకయ్య, నక్కా రాధయ్య, రాజా, టెర్మినల్ ఆధారిత ఉద్యోగుల సంఘం నాయకులు రామారావు, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

## సదస్సులతో మెరుగైన వైద్యం

● ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి
● మధుమేహ సదస్సుకు వివిధ రాష్ట్రాల వైద్య నిపుణుల హాజరు



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి

**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 22 :** మేధో సదస్సులు నిర్వహించడం ద్వారా వ్యాధుల చికిత్సలో ఆధునిక విధానాలు తెలుసుకోవడం, మేధో సంపత్తిని పెంచుకోవడం వల్ల మెరుగైన వైద్యం అందించవచ్చని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి అన్నారు. ఏపీ డయాబిటిస్ ఫెడరేషన్ రాష్ట్ర సదస్సు నెల్లూరులోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. మధుమేహ వ్యాధి నివారణ, వైద్య విధానాలపై హైదరాబాద్, బెంగళూరు నుంచి వచ్చిన వైద్య నిపుణులు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాధికారెడ్డి ప్రసంగిస్తూ ఆరోగ్య విశ్వవిద్యాలయం కింద ఎన్నో వైద్య కళాశాలలు నడుస్తున్నాయని, వాటిలో పని చేస్తున్న వైద్యులకు ఇలాంటి సదస్సుల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. హైదరాబాద్ నుంచి వచ్చిన వైద్య నిపుణులు డాక్టర్ పీవీ రావు, డాక్టర్ సంజయ్‌రెడ్డి, డాక్టర్ వసంతకుమార్ మధుమేహ వైద్య రంగంలో వస్తున్న మార్పులను వివరించారు. చెన్నై నుంచి వచ్చిన డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ విశ్వనాథన్, డాక్టర్ నరసింగన్ మాట్లాడుతూ హైపర్ టెన్షన్ డయాబిటిస్‌ను ఎలా నియంత్రించాలో తెలియజేశారు. బెంగళూరు నుంచి వచ్చిన వైద్య నిపుణులు డాక్టర్ కృష్ణశేషాద్రి, డాక్టర్ ప్రసన్నకుమార్ క్రమపద్ధతిలో మధుమేహ నివారణపై అవగాహన కల్పించారు. డయాబిటిస్ ఫెడరేషన్ కార్యనిర్వాహణ కార్యదర్శి డాక్టర్ పావులూరి మాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ఐఎంఏ రాష్ట్ర నేత డాక్టర్ అశోక్, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎంసీఎస్ రెడ్డి, సదస్సు నిర్వహణ రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డాక్టర్ మూర్తి, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ సహజ, డాక్టర్ రాము, డాక్టర్ మీనాక్షి సుందరి తదితరులు పాల్గొన్నారు.

# ఏవీ.. సర్వీస్ రోడ్లు, స్పీడ్‌బ్రేకర్లు ?


వలేటివారిపాలెంలో ఏర్పాటు చేయని సర్వీసు రోడ్డు

**వలేటివారిపాలెం, సెప్టెంబరు 22:** స్థానిక నేషనల్‌హైవే నుంచి లింగపాలెంనకు వెళ్లే క్రాస్‌రోడ్డులో ఇరువైపులా స్పీడ్‌బ్రేకర్ల ఏర్పాటుతో పాటు సర్వీసు రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు దాటే సమయంలో ఇప్పటికే ఐదారు రోడ్డు ప్రమాదాలు జరిగాయన్నారు. కొందరు కాళ్లు, చేతులు విరిగిపోయి మంచాలకే పరిమితం అయినట్లు చెప్పారు. ప్రకాశం జిల్లా శింగరాయికొండ నుండి పామూరు వరకు 47కిలోమీటర్లు నేషనల్‌హైవేలోని అన్నిగ్రామాల్లో క్రాస్ రోడ్డు వద్ద స్పీడు బ్రేకర్లు, సర్వీసు రోడ్లు ఏర్పాటు చేశారు. చిన్న గ్రామాల్లో సైతం ఇవి కన్పిస్తున్నాయని, మండల కేంద్రంలో ఎందుకు ఏర్పాటు చేయరో తెలియడం లేదని ప్రజలు చర్చించుకుంటున్నారు. లింగపాలెం క్రాస్ రోడ్డు ప్రక్కన పెట్రోలు బంకు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణం పూర్తయితే వాహనాలు రద్దీ పెరిగి ప్రమాదాలు పెరిగే అవకాశాలు ఉందని చెబుతున్నారు.

# ప్రజల కోసం పరితపించే వ్యక్తి సీఎం చంద్రబాబు

● కావలి ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

**కావలి, సెప్టెంబరు 22:** ప్రజల కోసం నిరంతరం పరితపించే వ్యక్తి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. స్థానిక 38వ వార్డులో ఆదివారం సాయంత్రం నిర్వహించిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వందరోజుల పనుల కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో అమృత్‌ఫైలాన్ కూల్చిన చోటనే ఐలవ్ కావలి ఐకాన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అమృత్‌పథకం పనులు త్వరలో పూర్తి చేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా త్వరలో ప్రారంభోత్సవం చేసి 7,500ఇళ్లకు తాగు నీరు అందజేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న వైకుంఠపురం ఫైవర్ బ్రిడ్జి పనులను త్వరలోనే చేపడతామన్నారు. అన్నపుగుంట మురుగునీటి బావుల నీరు బోర్లలోకి ఇంకుండా డ్రైనేజీ ద్వారా బయటకు పంపుతామన్నారు. మున్సిపల్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా పనిచేసే వారికే పట్టం కట్టాలని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రావణ్‌కుమార్, డీఈ సాయిరామ్, నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ క్రిషోర్, జ్యోతిబాబూరావు, పోతుగంటి అలేఖ్య, గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, కండ్లగుంట మధుబాబు నాయుడు, బొజవాడ రవీంద్ర, సమ్మను వెంకటసుబ్బయ్య, రుషికేష్, బ్రహ్మానందం పాల్గొన్నారు.


కావలి: కరపత్రాన్ని అందచేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి


కందుకూరు: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు:** ప్రజలకు మంచి చేయటమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రణాళికలు రచిస్తున్నాడని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలోని పోతురాజుమిట్ట ప్రాంతంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి వందరోజుల్లో అమలు చేసిన సంక్షేమ కార్య క్రమాలను వివరిస్తూ కరపత్రాలు, స్టిక్కర్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రజాదర్బారు కార్యక్రమం నిర్వహించి అర్జీలు స్వీకరించారు. పట్టణంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకుని పేదలకు నివాస స్థలాలుగా పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటా మన్నారు. డంపింగ్‌యార్డు సమస్యను 6నెలల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, తహసీల్దార్ ఇక్బాల్, నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, మంగపాటి శ్రీనివాసరావు, వడ్డెళ్ల రవిచంద్ర, బెజవాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

**దుత్తలూరు(ఉదయగిరి రూరల్):** ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పేర్కొన్నారు. ఆదివారం మం డలంలోని తెడ్డుపాడు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భా గంగా నాయకులు, కార్యకర్తలతో కలిసి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను తెలియచేసి కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామ పురవీదుల్లో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి పంచాయతీలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్య క్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు వికాస్ హరికృష్ణ, మండల టీడీపీ కన్వీ నర్ పేలపూడి వెంకటరత్నం, సర్పంచ్ బోయపాటి వెంకటరత్నం, తహసీ ల్దారు నాగరాజు, ఎంపీడీవో సంధ్యాలక్ష్మి, కూటమి నాయకులు శ్రీకుర్తి రవీంద్ర బాబు, కాకర్ల మధు, దయానందం, చీదర్ల మల్లికార్జున, చుండి హరిగోపా లరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి రూరల్: తెడ్డుపాడులో నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

● వింజమూరులో..

నందిగుంటలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఆ నిర్వహించారు. ఎస్సీ కాలనీలో టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్లు, గంగ పట్ల రంగయ్య ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

**ఏఎస్ పేట:** హసనపురంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీచేశారు. ఎన్‌డిసిసి బ్యాంక్ జిల్లా మాజీ చెర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, మండల కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, నంది వివేకానందరెడ్డి, మాల్యాద్రినాయుడు, షేక్ జిలానీబాషా, అల్లంపాటి కృష్ణారెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# కావలి

## కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

### పొడపాటి శివకుమార్ బీజేపీలో చేరిక

**కందుకూరు, సెప్టెంబరు 22:** జై భారత్ నేషనల్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేసిన పొడపాటి శివకుమార్ (చక్రి) ఆదివారం బీజేపీలో చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ నెల్లూరు జిల్లా ఇన్‌చార్జి వెంకయ్యానా యుడు సమక్షంలో ఆయన పార్టీ సభ్యత్వం స్వీకరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు మన్నేపల్లి వరప్రసాదరావు, చుండి మురళీధర్, బుర్రా కోటేశ్వరరావు, మాల్యాద్రి నాయుడు, వైకుంఠం, శ్రీధర్, మువ్వల భూషయ్య పాల్గొన్నారు.

### ఆర్టీసీ ఉత్తమ డెలిగేట్ నల్లూరి సుబ్బారావుకు అభినందనలు

**కందుకూరు, సెప్టెంబరు 22:** ఏపీఎస్‌ఆర్టీసీ క్రెడిట్ కో ఆపరేటివ్ సొసైటీ (సీసీఎస్) ద్వారా కార్మికులకు సేవలందించి రాష్ట్రస్థాయి ఉత్తమ డెలిగేట్‌గా ఎంపికైయ్యాడు కందుకూరు డిపో నల్లూరి సుబ్బారావు. విజయవాడలో జరిగిన ఆర్టీసీ సీసీఎస్ 69వ వార్షికోత్సవంలో ఆర్టీసీ ఎండీ, రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావు ముఖ్యఅతిథిగా పాల్గొని సుబ్బారావుకు ప్రశంసాపత్రం, నగదు బహుమతిని అందజేశారు. ఆదివారం కందుకూరు డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజరు శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజరు ప్రసాదు, ఈయూ నాయకులు రాజు, మహేష్, శివ, కొండలు, రహంతుల్లా, స్వామి ఆయన్ను అభినందించారు.

### ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం


రిటైర్డ్ టీచర్లను సన్మానించిన యూటీఎఫ్ నేతలు

**కావలి, సెప్టెంబరు 22:** ఉద్యమాలతోనే ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి సాధ్యపడుతోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కిలారి వెంకటేశ్వర్లు, జీవీ చలపతిశర్మ తెలిపారు. ఆదివారం స్థానిక సాయి డిగ్రీకళాశాల ఆడిటోరియంలో యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మండల మహాసభ నిర్వహించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమాలలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ప్రసాద్, లక్ష్మీ, మాధవ, తోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల కమిటీ గౌరవాధ్యక్షుడిగా సత్యనారాయణ, అధ్యక్షుడిగా ముజీజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా వేణుగోపాల్, కోశాధికారిగా చెన్నక్రిష్ణయ్య ఉన్నారు.

### నార్త్తుమోపూరులో ఉచిత వైద్యశిబిరం

**అల్లూరు, సెప్టెంబరు 22:** ఆశా లైఫ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నార్త్తుమోపూరులో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో చేపట్టిన శిబిరంలో ప్రముఖ న్యూరాలజిస్ట్ బిందుమీనన్ పాల్గొని స్థానికులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నెల్లూరు నిరంజన్‌రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, చేజర్ల వెంకటేశ్వర్లు, ఎల్లు సాల్మన్‌రాజు, ఆశీర్వాదం, బాపన విజయకుమార్, నార్త్తు మోపూరు యూత్ సభ్యులు పాల్గొన్నారు.



### శాంతిభద్రతలకు ప్రాధాన్యం

● ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

**కందుకూరు, సెప్టెంబరు 22:** నియోజకవర్గంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యం కల్పిస్తామని, పట్టణంలో ఆర్యవైశ్యులు ప్రశాంత వాతావరణంలో వ్యాపారం చేసుకునేందుకు అన్నివిధాలా తాను అండగా ఉంటానని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం పెద్దబజారు వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయ కళ్యాణ మండపంలో పోలీసుశాఖ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఇటీ వల జరిగిన శ్రీగాయత్రీ గోల్డ్‌షాప్ దొంగతనం రికవరీని ప్రస్తావించారు. ఇకముందు కూడా పట్టణంలో దొంగతనం జరిగినా వెంటనే గుర్తించేందుకు వీలుగా అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తా మన్నారు. 24గంటలు గడవకముందే దొంగలను పట్టుకుని సొత్తు రికవరీ చేసిన సీఐ వెంకటేశ్వరరావును ఎమ్మెల్యే అభినందించారు. అనంతరం సీఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఇలాంటి సమావేశం ఏర్పాటు చేయించటం గొప్ప విషయమన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటు వల్లే బంగారం షాపులో దొంగలను పట్టుకోగలిగామని తెలిపారు. ఈ సందర్భంగా బులియన్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే నాగేశ్వరరావును సత్కరించారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ సాంబశివయ్య, ఆర్యవైశ్య ప్రముఖులు మురారిశెట్టి సుధీర్‌కుమార్, కొత్తూరి సుధాకరరావు, కోటా కిషోర్, చక్కా కేశవ, కోట నరసింహం, ఇమ్మడిశెట్టి సుబ్బరాయుడు, తుమ్మపూడి సురేష్, మురారి శెట్టి వెంకటసుబ్బారావు, బొగ్గవరపు సత్యం, చీదెళ్ల పిచ్చయ్య పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు

**కావలి, సెప్టెంబరు 22:** స్థానిక ట్రంకు రోడ్డులోని దుకాణాల ఎదుట వాహనాల పార్కింగ్‌కు స్థలం కేటాయిస్తూ ఆదివారం సాయంత్రం ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి పోల్స్ నాటించారు. పోల్స్ అవతల మాత్రమే వ్యాపారాలు చేసుకోవాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తిచేసి ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించాలన్నారు.

### రేపటి నుంచి పొలం పిలుస్తోంది

**ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 22:** ఉదయగిరి సబ్ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో మంగళవారం నుంచి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు చెన్నారెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వారంలో ప్రతి మంగళ, బుధవారాల్లో ఉదయం ఒక గ్రామం, సాయంత్రం మరో గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధశాఖల అధికారులు పాల్గొని పొలాలను సందర్శించి రైతులకు వ్యవసాయంలో సాంకేతిక సలహాలు అందచేస్తారని, కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, రైతులు తప్పనిసరిగా హాజరు కావాలని ఆయన కోరారు.

### రోడ్డు ప్రమాదంలో తాతామనవడు మృతి

**వలేటివారిపాలెం, సెప్టెంబరు 22:** అయ్యవారిపల్లె టీడీపీ సీనియర్ నాయకుడు ఉప్పుటూరి పెదకొండపనాయుడు (73) ఆయన మనవడు ఉప్పుటూరి దినేష్ (10) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ సంఘటన శనివారం రాత్రి 7గంటల సమయంలో విజయవాడ సిటీలో జరిగింది. దినేష్ అక్కడికక్కడే మృతి చెందగా, పెదకొండపనాయుడు ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం 7గంటల సమయంలో తుదిశ్వాస విడిచాడు. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదకొండపనాయుడు, దినేష్‌ను ట్యూషన్ నుండి మోటారుబైకుపై ఇంటికి తీసుకెళ్తుండగా రోడ్డు దాటే సమయంలో వేగంగా వస్తున్న టిప్పర్ ఢీకొంది. పెద్దకొండపనాయుడు కొడుకు, కోడలు, వారి పిల్లలు, కూతురు, అల్లుడు వారి పిల్లలు గత కొన్నేళ్లుగా వ్యాపార నిమ్మితం విజయవాడలోనే ఉంటున్నారు. రెండు మృతదేహాలకు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహాలను అయ్యవారిపల్లెకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. కుటుంబసభ్యులు, బంధువులు రోదన స్థానికు లను కదలించాయి.

### మాలో ఎలాంటి గ్రూపులు లేవు

● మాలేపాటి సుబ్బానాయుడు

**కావలి, సెప్టెంబరు 22:** కావలి టీడీపీలో గ్రూపులు లేవని పార్టీ నాయకులంతా ఒక్కటేనని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాలేపాటి సుబ్బానాయుడు తెలిపారు. ఆదివారం పట్టణంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడును చూసే ప్రజలు ఓట్లు వేశారన్నారు. వైసీపీ పాలనలో జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సామాజిక పింఛన్లు, ఉద్యోగుల జీతాలు పెంచి ఒకటో తేదీనే జీతాలు చెల్లించటం సమర్థవంతమైన పాలనకు నిదర్శనమన్నారు. టీడీపీ పాలనలో కావలి-తుమ్మలపెంట, దగదర్తి-బుచ్చి రోడ్లకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర కృషితో నిధులు మంజూరైతే వైసీపీ ప్రభుత్వం పనులు చేయకుండా వదిలేసిందన్నారు. తుమ్మలపెంట రోడ్డులోని గుంటలకు మట్టి పోస్తే నాపై కేసులు పెట్టారని మాలేపాటి గుర్తుచేశారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగుతున్నాని మరణించే వరకు టీడీపీతోనే ప్రయాణిస్తానన్నారు.

**పార్టీ నాయకులను కలిస్తే తప్పా : మన్నవ**

తాను టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ పార్టీ ప్రధాన కార్యాలయాలకు వెళ్లి ముఖ్యులను కలుస్తుంటానని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మన్నవ రవిచంద్ర తెలిపారు. అందులో భాగంగా ఇటీవల అమరావతి వెళ్లి మంత్రి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, కిలారి రాజేశ్వరరావును కలిస్తే తనపై విమర్శలు చేయటం ఏమిటని ప్రశ్నించారు. సమావేశంలో టీడీపీ నేతలు విజయకుమార్‌రెడ్డి, మణి పాల్గొన్నారు.

### ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం


సన్మానం అందుకున్న ఉత్తమ ఉపాధ్యాయులు

**కలువాయి, సెప్టెంబరు 22:** స్థానిక విశ్వం ఉన్నత పాఠశాలలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వెంకటగిరి నియోజకవర్గంలోని కలువాయి, రాపూరు, బాలాయపల్లి, సైదాపురం మండలాల పరిధిలోని 11 పాఠశాలలకు చెందిన 23 మంది ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ శ్రీధర్, జిల్లా కోశాధికారి కృష్ణారావు, ఈసీ మెంబర్ శివకుమార్, రాపూరు అధ్యక్షుడు మునిందర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు పుల్లయ్య, కరస్పాండెంట్లు, టీచర్లు పాల్గొన్నారు.

### నేడు కొండాపురంలో ఎమ్మెల్యే పర్యటన

**కొండాపురం, సెప్టెంబరు 22:** ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ సోమవారం మండలంలో పర్యటించనున్నట్లు టీడీపీ కన్వీనర్ మామిళ్లపల్లి ఓంకారం తెలిపారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కలిగిరి నుండి వల్లేటివారిపాలెం వరకు మంజూరైన రెండు లైన్ల రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్ర మంలో భాగంగా గుడవళ్లూరులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన పనుల కరపత్రాలను అందజేస్తారని చెప్పారు. ఈ పర్యటనలో కూటమి నేతలు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యారవ క్రిష్ణయ్య, పోలినేని రమేష్, చాగంటి క్రిష్ణ, నరేంద్ర, కె.రాఘవేంద్ర, తిప్పినేని రమేష్ పాల్గొన్నారు.

### నీటి వృథా.. రేపటి వ్యథ..!


సింథటిక్ ట్యాంకు నుంచి వృథాగా పోతున్న నీరు

**ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 22:** ఉదయగిరి పట్టణంలో నీటి విడుదల సమయంలో ట్యాపులు లేకపోవడం, పైపుల లీకేజీలు, పగుళ్లకారణంగా నిత్యం నీటి వృథా అవుతోంది. మరోవైపు వీధుల్లో ఏర్పాటుచేసిన ట్యాంకులకు నీటిని సరఫరా చేసే సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో అవి నిండి పొంగిపొర్లుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

**వర్షం వస్తే ఇదీ పరిస్థితి !**



స్థానిక ఆర్టీసీ డిపో ఆవరణలో బస్సుల రాకపోకలకు అనువుగా కాంక్రీట్ నిర్మాణం చేపట్టారు. అయితే వర్షం వస్తే నీరు వెళ్లేందుకు అనువుగా సైడ్ కాలువ నిర్మాణం చేపట్టకలేదు. ఈ సమస్యతో ఆదివారం కురిసిన వర్షంతో బస్టాండ్ ఆవరణం నుంచి గ్యారేజీలోకి వెళ్లే మార్గంలోని బస్టాండ్ ఆవరణంలో వర్షపు నీరు నిలిచి పోయింది. ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - కావలి

**అల్లుకున్న తీగలు తొలగించరా ?**



వలేటివారిపాలెం నుండి చుండికి వెళ్లే రోడ్డులో రైతు కాకుమాను మాల్యాద్రి పొలంలో విద్యుత్ స్తంభానికి తీగలు అల్లుకున్నాయి. సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కూడా ఉంది. కరెంట్ సరఫరా కాకపోతే రైతులు ఇక్కడి వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు పనులు చేయించాల్సి ఉంటుంది. అల్లుకున్న తీగలతో స్తంభం ఎక్కేందుకు కరెంట్ మెకానిక్‌లు, రైతులు జంకుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. -వలేటివారిపాలెం

**పేరు మారలేదు..**




అంకభూపాలపురం రైతుసేవా కేంద్రం ఇది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రంగానే పేరు ఉంది. కూటమి ప్రభుత్వం ఈ కేంద్రాల పేర్లు మార్చాలని జీవో విడుదల చేసి నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. పాలకుల ఆదేశాలు వీరు మరిచారా అని స్థానికులు చర్చించుకుంటున్నారు. -వలేటివారిపాలెం

### ఏచూరి ఆశయాలను కొనసాగించాలి


నివాళులర్పిస్తున్న మాజీఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం

**కందుకూరు, సెప్టెంబరు 22:** లౌకికవాది, పోరాటయోధుడు సీతారాం ఏచూరి ఆశయాలను కొనసా గించాలని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం సంతాపసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్కే. నల్మా, మోహనరావు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

### మాతా పరమేశ్వరి సన్నిధిలో మెట్టుకూరు



**సంగం, సెప్టెంబరు 22:** స్థానిక చెక్‌పోస్టు సెంటర్‌లో ఉన్న మాతాపరమేశ్వరి అమ్మవారిని ఎన్‌డీసీసీబీ మాజీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. ఏయస్‌పేట మండలం హసనాపురంలో జరిగిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి హాజరై తిరిగి నెల్లూరు వెళ్తుండగా టీడీపీ నేత మధుసూదన్ యాదవ్ ఆధ్వర్యంలో స్థానిక చెక్‌పోస్టు కాలనీవాసులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మాతాపరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# మెరుగు పేరుతో మోసం

● బిహార్ యువకుల నిర్వాహకం

● 24గ్రాముల దండలో 11 గ్రాములు కరిగించిన వైనం


మోసపోయిన దొరసానమ్మ

**లింగసముద్రం, సెప్టెంబరు 22:** బంగారు దండకు మెరుగు పట్టిస్తామని బిహార్‌కు చెందిన ఇద్దరు యువకులు ఆదివారం మధ్యాహ్నం 1గంట సమయంలో లింగసముద్రంలో ఓ మహిళను మోసం చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని సుబ్బయ్య సామిల్లు వీధిలోకి ఉంటున్న సోమరపాటి దొరసానమ్మను బీహార్ యువకులు కలిశారు. విషయం చెప్పడంతో ఆమె ఇంట్లోని తన 24గ్రాముల (3సవర్లు) దండ తెచ్చి వారి చేతికి ఇచ్చింది. వారిలో ఓయువకుడు ఆ దండకు మెరుగు పట్టినట్టు నటించి ద్రావకంలో ఆ దండను కరిగించి, పసుపు పూసి ఇచ్చి వెళ్లి పోయారు. అయితే ఆమె దండను ఇంట్లోకి తీసుకెళ్లి కడి గి చూడటంతో బరువు తగ్గినట్టు అనుమానం వచ్చింది. వెంటనే కుమారుడు, కోడలికి చెప్పింది. వారు చుట్టుపక్కల వారికి జరిగిన విషయం చెప్పారు. గ్రామంలో గాలింపు చర్యలు చేపట్టారు. దండకు మెరుగు పట్టిన యువకుడు పరారు కాగా మరో యువకుడు బస్టాండ్ వద్ద గ్రామస్థుల చేతికి చిక్కాడు. అతన్ని పోలీసులకు అప్పగించారు. అయితే బంగారం దండను తూకం వేయగా 24గ్రాముల్లో 11గ్రాములు తగ్గినట్టు గుర్తించారు. ఈ మేరకు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

### ఒక్కరోజు ఉపయోగిస్తే ఒట్టు..!

● పనికిరాకుండా పోయిన చెత్త సేకరణ వాహనాలు

**కలువాయి :** పంచాయతీలో చెత్త సేకరణకు ప్రభుత్వం అందించిన మూడుచక్రాల రిక్షాలు తుప్పు పట్టి పనికిరాకుండా పోయాయి. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం లక్షలు వెచ్చించి మూడుచక్రాల రిక్షాలు, మినీ లారీ ఇచ్చింది. వీటిని తీసుకొచ్చి పంచాయతీ కార్యాలయంలో మూలపడేశారు. వీటిని ఒక్కరోజు కూడా చెత్త సేకరణకు ఉపయోగించలేదు. ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పుపట్టి పోతున్నాయి. వీటిని చూసిన వారంతా లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అయిందంటున్నారు.



# వరుణుడి కోసం మిర్చి రైతు ఎదురుచూపు

● అదును దాటుతోందని రైతుల ఆందోళన

**వలేటివారిపాలెం, సెప్టెంబరు 22:** అరుగాలం కష్టించే రైతన్నలు వరుణదేవుడి కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. ఖరీఫ్ ఆరంభమై మూడునెలలు దాటినా మండలంలో వర్షం జాడలేదు. అడపాదడపా కురిసిన జల్లులకు రైతులు దుక్కులు దున్నుకున్నారు. బోర్లు, బావుల కింద మిర్చి, పొగాకు నారుమడులు సిద్ధం చేశారు. మిర్చినారు ఏతకు వచ్చిందని, మండలంలో వర్షం జాడ లేదు, ప్రతి రోజూ మబ్బులు పట్టి ఊరించి ఉసూరుమనిపించడం తప్ప భూమ్మీద చినుకు పడటం లేదని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది జూన్, జూలై, ఆగస్టు నెలల్లో కూడా సాధారణ వర్షపాతం నమోదు కాలేదు.


మిర్చి నాట్లు వేసేందుకు దుక్కి చేసిన పొలం


వలేటివారిపాలెంలో నాట్లకు సిద్ధంగా ఉన్న మిరప నారు

జోరుగా వర్షాలు కురిసి ముసురు పట్టాల్సిన సెప్టెంబరు నెలలో వడగాల్పులు వీస్తున్నాయి. మిర్చి పంట సాగు చేసేందుకు అదును దాటిపోతుందని ఆందోళన చెందుతున్నారు. మిర్చి నాట్లు వేసేందుకు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. అదునులో వర్షం కురిసి మిర్చి నాట్లు వేయకపోతే తెగుళ్ల బెడద, దిగుబడులు తగ్గి నష్టాలు వస్తాయని చెబుతున్నారు. పది రోజుల్లో వర్షం పడకపోతే అదును దాటిపోతుంది తరువాత మిర్చి సాగు చేసినా ఫలితం ఉండదంటున్నారు.

# నెల్లూరు సిటీ, రూరల్
# కోవూరు, సర్వేపల్లి

## గంగమ్మ గ్రామోత్సవం

**మనుబోలు, సెప్టెంబరు 22:** మండలంలోని బండేపల్లిలో శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు గంగమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. నెల రోజుల క్రితం గ్రామంలో గంగమ్మ తిరునాళ్లు నిర్వహించారు. నెలకొలుపు సందర్భంగా యాదవ సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు, పొంగళ్లు పొంగించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవారిని గజమాల లతో ప్రత్యేకంగా అలంకరించి విద్యుద్దీపాలు, బాణాసంచా, మేళతాళాలు, తప్పెట్ల సందడితో గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు ఉడతా రవి, ఆవుల నరేంద్రబాబు, మేకల యోగేశ్వరరావు పర్యవేక్షించారు.

## రేపు బీఎస్పీ రౌండ్ టేబుల్ సమావేశం

**కోవూరు, సెప్టెంబరు 22:** వెనకబడిన కులాల జనగణన చేయాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరు నగరం ముత్తుకూరు రోడ్డులోని రాధే గెస్ట్ ఇన్ ఫంక్షన్ హాలులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకీ ప్రసాద్ తెలిపారు. స్థానిక తాలుకాఫీసు కూడలిలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన బీఎస్పీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రౌండ్ టేబుల్ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు రాంజీ గౌతమ్, బీఎస్పీ రాష్ట్ర నాయకులు పరంజ్యోతి, ఎం.బాలయ్య, జే పూర్ణచంద్రరావు, నందకుమార్ పాల్గొంటారన్నారు. నియోజకవర్గ పరిధిలోని బీసీ, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరుకావాలని కోరారు. ఈ సమావేశంలో బీఎస్పీ నాయకులు కడింపాటి అనిల్, ఎంబేటి శ్రీనివాసులు, కడింపాటి అశోక్ పాల్గొన్నారు.

## గాంధీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు

**ఇందుకూరుపేట, సెప్టెంబరు 22 :** మండలంలోని పల్లెపాడు పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో ఆదివారం సర్వమత ప్రార్థనలు జరిగాయి. ముందుగా కమిటీ సభ్యులు గంపల మంజుల మహాత్మాగాంధీ విగ్రహం, స్థల దాత పొణక కనకమ్మ విగ్రహాలకు ఖాదీ వస్త్రాలు, నూలు మాలలు సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మాగాంధీ జీవిత విశేషాలు గురించి, పినాకినీ సత్యాగ్రహ గాంధీ ఆశ్రమం చరిత్ర గురించి వివరించి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ సభ్యత్వ నమోదు

**విడవలూరు, సెప్టెంబరు 22 :** మండలంలోని రామతీర్థం, దండిగుంట, వావిళ్ల గ్రామాల్లో ఆదివారం బీజేపీ సభ్యత్వ నమోదు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి ప్రసాద్ పాల్గొని యువతతో సభ్యత్వ నమోదు చేయించారు. దేశాన్ని ప్రగతి పథంలో నడిపించడంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఎంతగానో కృషి చేస్తున్నారని, దీనితో యువతీ యువకులు, మహిళలు బీజేపీపై ఆసక్తి కనపరుస్తున్నారని తెలిపారు.

## వినాయకుడి 16 రోజుల పండుగ

**పొదలకూరు, సెప్టెంబరు 22 :** పట్టణంలోని పలు వీధుల్లో వినాయక చవితి అనంతరం నిర్వహించే 16 రోజుల పండుగను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. యాదవవీధి, కన్యకా పరమేశ్వరి ఆలయం వీధితోపాటు కొన్ని ప్రాంతాల్లో పండరి, చెక్క భజనలు నిర్వహించారు. స్థానికులు కలిసి వివిధ ప్రాంతాలకు ఆధ్యాత్మిక విహార యాత్రలకు వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

## కామాక్షితాయికి పూలంగి సేవ

**బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 22:** మండలంలోని జొన్నవాడ ఆలయంలో ఆదివారం గర్భాలయం, అంతరాలయంతోపాటు మల్లికార్జునస్వామి, కామాక్షితాయికి ప్రత్యేక పూలంగిసేవ నిర్వహించారు. లక్ష్మీ గణపతి, వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పుష్పాలంకరణ జరిగింది. ఈ కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన జనంపల్లి దుష్యంత్‌రెడ్డి, మేఘనారెడ్డి దంపతులు, కుమారుడు సాకేత్ రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

## ఉరుములు, మెరుపులతో జల్లులు

**నెల్లూరు(హరనాథపురం):** నగరంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. కొద్ది రోజులుగా వేసవిని తలపించేలా ఎండలు మండుతుండటంతో అల్లాడుతున్న ప్రజలకు తాజా వర్షం, చల్లని గాలులతో ఉపశమనం లభించింది.

## ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవలు భేష్

- కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కామేశ్వరి

**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 22 :** ప్రభుత్వం నర్సింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ సేవలు అభినందనీయమని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కామేశ్వరి అన్నారు. ఆదివారం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు నగరంలోని 13వ డివిజన్ యనమలవారి దిన్నె పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు. రోగులకు సేవలతో పాటు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు 7 రోజులపాటు ఇక్కడ పలు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. టీడీపీ డివిజన్ ఇన్‌చార్జి ఊటుకూరు చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు సేవ చేసేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వసుంధర, డాక్టర్ ప్రసూనకుమారి, డాక్టర్ శరత్‌బాబు, టీడీపీ నేతలు ప్రశాంత్, శీనయ్య తదితరులు పాల్గొన్నారు.

## నేడు వారాహి రథయాత్ర, హోమం

**నెల్లూరు (సాంస్కృతికం) :** నగరంలో సోమవారం వారాహి అమ్మవారి మహా రథయాత్ర, హోమం జరగనున్నాయి. తిరుపతి నుంచి బయలుదేరిన వారాహి అమ్మవారి మహారథయాత్ర ఉదయం 6గంటలకు అయ్యప్పగుడి వద్దకు చేరుకోనుంది. భక్తుల భజనలు, కోలాటాలు, బాణాసంచా వేడుకలతో నెల్లూరు పురవీధుల్లో తిరుగుతూ వీఆర్సీ మైదానం చేరుకుంటుంది. అనంతరం మైదానంలో హోమం జరుగుతుందని భక్తబృందం పేర్కొంది. కాగా, వారాహి యాత్ర బ్రోచర్‌ను గోమతి నగర్‌లోని జనసేన పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. యాత్రను విజయవంతం చేయాలని పార్టీ సీనియర్ నేత, కోర్ కమిటీ సభ్యుడు నూనె మల్లికార్జున యాదవ్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సుందరరామిరెడ్డి, జమీర్, లాయర్ శ్రీరామ్, రవి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## కలగా మిగిలిన క్రికెట్ స్టేడియం!

- ఐదేళ్లుగా నిర్మాణానికి నోచని వైనం




క్రికెట్ స్టేడియం కోసం గొలగమూడి సమీపంలో సేకరించిన స్థలం

**వెంకటాచలం, సెప్టెంబరు 22 :** మండలంలోని గొలగమూడి సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు గత టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందుకు స్థలాన్ని కూడా సేకరించింది. ఆ తరువాత ప్రభుత్వం మారడంతో స్టేడియం నిర్మాణానికి గ్రహణం పట్టింది. వివరాలు ఇలా ఉన్నాయి. వివిధ క్రీడలకు సంబంధించి అంతంత మాత్రంగానే వసతులు ఉన్న నేపథ్యంలో మండలంలోని గొలగమూడి సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనికి అవసరమైన 50 ఎకరాల భూమిని సేకరించి రాష్ట్ర క్రికెట్ బోర్డుకు అప్పగించింది. అయితే ఆ భూములను గతంలో తమకు ప్రభుత్వం ఇచ్చిందంటూ గ్రామానికి చెందిన కొందరు భూసేకరణకు అడ్డుతగిలి కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన భూములను లబ్ధిదారులు సాగు చేయనందువల్ల తిరిగి తీసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుందని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో భూసేకరణకు ఉన్న అడ్డంకి తొలగిపోవడంతో స్థల సేకరణ పూర్తయింది. స్థలం వద్ద బోర్డును కూడా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో త్వరలో స్టేడియం నిర్మాణం జరుగుతుందని క్రీడాకారులు, క్రీడాభిమానులు ఆశించారు. ఇంతలో రాష్ట్రంలో ప్రభుత్వం మారి వైసీపీ అధికారంలోకి వచ్చింది. కానీ క్రికెట్ స్టేడియం నిర్మాణాన్ని విస్మరించడంతో క్రీడాభిమానులు గత ప్రభుత్వ వైఖరి పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గత ఐదేళ్ల కిందట క్రికెట్ స్టేడియం నిర్మాణానికి బీజం వేసి స్థల సేకరణ పూర్తిచేయించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డే ఎన్డీఏ కూటమిలో సర్వేపల్లి ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో స్టేడియం నిర్మాణం పూర్తవుతుందని క్రీడాకారులు ఆశిస్తున్నారు. ఇకనైనా స్టేడియం నిర్మించి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నారు.

## 'నారా లోకేష్ ఆరోగ్య రక్ష' ప్రారంభం

- ఊరూరా వైద్య పరీక్షలు : రూరల్ ఎమ్మెల్యే



వైద్య పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

**నెల్లూరు రూరల్, సెప్టెంబరు 22 :** చాలా మంది తమ జబ్బులను ప్రాథమిక దశలో గుర్తించక ప్రాణాలు కోల్పోతున్నారని, అందుకే తాము నారా లోకేష్ పేరిట ఆరోగ్య రక్ష కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలంలోని దేవరపాళెంలో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఊరూరా నిర్వహించే ఆరోగ్య రక్ష కార్యక్రమంలో ప్రతీ ఒక్కరు వైద్య పరీక్షలు చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి మెడికవర్ ఆసుపత్రి సహకరిస్తోందని తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందచేశారు. ముందుగా నెల్లూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో 17వ డివిజన్ వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమా లలో టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, వేదగిరి క్షేత్రం మాజీ చైర్మన్లు వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, ఆరోగ్య రక్ష కన్వీనర్ దాట్ల చక్రవర్ధన్‌రెడ్డి, నాయకులు పముజుల ప్రదీప్, అచ్యుత్‌రెడ్డి, నారాయణరెడ్డి, నూకరాజు మదన్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

### టీడీపీలోకి రూరల్ ఎంపీపీ ?

వైసీపీ నాయకుడు, నెల్లూరు రూరల్ ఎంపీపీ బూడిద విజయ్‌కుమార్ టీడీపీలోకి రానున్నారు. ఆయన ఆదివారం నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆయన సోదరుడు గిరిధర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీలోకి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నానని, అనుమతివ్వాలని కోరారు. స్థానిక నాయకులు, కార్యకర్తలతో మాట్లాడి నిర్ణయం వెల్లడిస్తామని కోటంరెడ్డి సోదరులు తెలిపారు. ఎంపీపీతోపాటు మరికొంత మంది సర్పంచులు, ఎంపీటీసీలు, వైసీపీ నాయకులు టీడీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

## అపూర్వ కలయిక



**పొదలకూరు, సెప్టెంబరు 22 :** మండలంలోని మహమ్మదాపురంలోని దొడ్ల సుబ్బారెడ్డి ఉన్నత పాఠశాలలో 1991-92 సంవత్స రంలో 10వ తరగతి చదివిన విద్యార్థులు 33 ఏళ్ల తర్వాత ఆదివారం అదే పాఠశాలలో కలిశారు. మూడున్నర దశాబ్దాల తర్వాత కుటుంబాలతో కలసి వచ్చి వీరి అపూర్వ కలయిక ఉత్సాహాన్ని నింపింది. ఆనాడు తమకు విద్యాబుద్ధలు నేర్పిన గురువులందరినీ ఆహ్వానించి శాలువా, పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి మధుర స్మృతు లను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారికి మెమోంటోలు అందించారు. ఈ కార్యక్రమంలో పి.తిరుపతి, బి.మనో హర్, పి.మాధవ్, టి.వెంకటేశ్వర్లు, ఆర్.చెంచయ్య, వి.హనుమంత్, పి.శంకరయ్య, కె.రమేష్, సీహెచ్.మురళి, సునీత, జ్యోతి, మోహన్ పాల్గొన్నారు.

## రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలి

- అంబేడ్కర్ బొమ్మ వద్ద పలు సంఘాల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

**నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 22 :** పశ్చిమ గోదావరి జిల్లా కాళ్లమండలం ఏలూరుపాడు గ్రామంలో ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించి అవమాన పరి చారంటూ పలు సంఘాలు ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపాయి. భారత్ మహాసేన సేవాదళ్ వ్యవస్థాపక అధ్యక్షుడు జువ్వగుంట బాబు, పౌరహక్కుల సంఘం నేత కుంచెం సుబ్బారావు మాట్లాడుతూ అంబేడ్కర్‌ను అవమానించిన ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజును సీఎం చంద్రబాబు టీడీపీ నుంచి సస్పెండ్ చేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో పముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ కూడా స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్స్ సంఘం నేత బ్రహ్మం, అంబేడ్కరిస్ట్ జాషువా, బీఎస్పీ నేతలు ఎంబేటి శ్రీనివాసులు, అరుణ, స్వయం సైనిక్‌దళ్ సుత హరి, బీమ్‌ఆర్మీ నేత ప్రసాద్, భక్తవత్సలం, అడ్వకేట్ సుధీర్, దళిత ప్రజావేదిక చంద్రశేఖర్, ఓపీడీఆర్ రమణమ్మ, నేతలు పాల్గొన్నారు.

## సాహిత్యం సమాజానికి మార్గదర్శి కావాలి

- 'తెలుగు సాహితీ' వ్యవస్థాపకురాలు శాంతికృష్ణ

**నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 22 :** సాహిత్యం సమాజానికి మార్గదర్శిగా ఉండాలని తెలుగు సాహితీ సంస్థ వ్యవస్థాపకురాలు శాంతికృష్ణ అన్నారు. ఆదివారం పొగతోటలోని ఆదిశంకరా ధ్యాన మందిరంలో సందడి అరుణ రాసిన ఆత్మీయ బంధాలు కథా సంపుటి ఆవిష్కరణ జరిగింది. నెల్లూరు రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధునిక సమాజంలో కథలు, నవలలు రావడంలేదన్నారు. టీవీ చానల్స్ ధాటికి సాహిత్యం కొంత వెనక్కు తగ్గిందన్నారు. అయినా మంచి సాహిత్యానికి విలువ తగ్గలేదన్నారు. ఈ కార్యక్రమంలో జీ శివకుమార్, ఏ జయప్రకాష్, పాతూరి అన్నపూర్ణ, సమయానందస్వామి, నజ్మా, శ్రీధర్‌బాబు, ఏ భారతి, కోదాడ రామయ్య, జీ విశ్వేశ్వరప్రసాద్, మోహనరాజు తదితరులు పాల్గొన్నారు.



కవితా సంపుటి ఆవిష్కరణ

## కూటమి ప్రభుత్వానికి ప్రజాదరణ

- 'ఇది మంచి ప్రభుత్వం'లో మంత్రి నారాయణ



కరపత్రాలు అందిస్తున్న మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి తదితరులు

**నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 22 :** రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వాన్ని ప్రజలు ఎంతో ఆదరిస్తున్నారని పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నగరంలోని 40వ డివిజన్‌లో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలను తెలియచేశారు. పంచాయితీలు, మున్సిపాలిటీలకు రూ.1452 కోట్లు ఇచ్చి అభివృద్ధి, సంక్షే మ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. రైతులకు బకాయిల చెల్లింపు, డీఎస్సీ నోటిఫికేష న్, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణను వివరించారు. దీపావళి నుంచి మహిళల కు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తామని వెల్లడించారు. వైసీపీ పాలనలో రివర్స్ టెండరింగ్ ద్వారా సర్వనాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటితే సమాజ శ్రేయస్సు

**నెల్లూరు రూరల్, సెప్టెంబరు 22 :** ప్రతీ వ్యక్తి తన జీవితంలోని ముఖ్యదినాలలో మొక్కలు నాటి సంరక్షిస్తే సమాజ శ్రేయస్సును ఉపయోగపడుతుందని పలువురు వక్తలు అభిప్రాయ పడ్డారు. ఆదివారం నగరంలోని 12వ డివిజన్ వావిలేటిపాడులో ఆల్తూరి ఆదిశేషయ్య ఫౌండే షన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కేఎన్ఆర్ రియాల్టీ అధినేత కుడుముల నాగేశ్వరరావు గౌడ్, ఏఏఎఫ్ అధినేత మస్తానయ్య మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలంటే ప్రతీ వ్యక్తి తమ జీవితాల్లోని ముఖ్యదినాలను మొక్కలనాటేందుకు కేటాయించాలన్నారు. తల్లిదండ్రుల పేరిట మొక్కలు నాటడం వల్ల వారిని పెరుగుతున్న మొక్కల్లో చూసుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఏ వెంకట రమణయ్య, వేణు(బాబీ), గాలి వెంకటేశ్వర్లు, ఉప్పల ఈశ్వరయ్య, హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ నిర్వాహకులు విజయ భాస్కర్, రవి, పవన్‌కుమార్‌రెడ్డి, జగన్‌మోహన్ పాల్గొన్నారు.

## అట్టహాసంగా 'ఇది మంచి ప్రభుత్వం'

- 100 రోజుల కూటమి పాలనను వివరించిన ఎంపీ, ఎమ్మెల్యేలు



రేబాలలో ఓ ఇంటికి స్టిక్కర్ అంటిస్తున్న ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

**బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు 22 :** మండలంలోని రేబాల, రేబాల కొత్తూరులో ఆదివారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు ఇంటింటికి వెళ్లి రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో సీఎం చంద్రబాబునాయుడు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించారు. దీనికి సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేయడంతో పాటు ప్రతి ఇంటికి ప్రభుత్వం సాధించిన ప్రగతిని తెలియజేసేలా స్టిక్కర్లు అంటించారు. అనంతరం రేబాల హైస్కూలులో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజలంతా కక్షలు, కార్పణ్యాలు లేకుండా ప్రశాంత వాతావరణంలో జీవించాలన్నారు. వివాద రహిత నియోజకవర్గంగా కోవూరును చూడాలన్నది తమ కలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, ఎంపీడీవో, నగర కమిషనర్, సీఐ, ఎస్సై, ఎంపీపీ శ్రీనివాసులు, సర్పంచు భాగ్యలక్ష్మి, నాయకులు ఎంవీ శేషయ్య, హరికృష్ణ, ఏటూరి శివరామకృష్ణారెడ్డి, ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, సూరా శ్రీనివాసులురెడ్డి, టీడీపీ. జనసేన, బీజేపీ నాయకుల పాల్గొన్నారు.

- బుచ్చిరెడ్డిపాళెంలో నగర పంచాయతీ భవన నిర్మాణ పనులను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డితో కలిసి పునఃప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీకాంతమ్మ, కళ్యాణ్, వైష్ణవి, ఎస్.ప్రభాకర్‌రెడ్డి, రామానాయుడు, హరనాథ్, బచ్చాబాయ్, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

**తోటపల్లిగూడూరు :** మండలంలోని శివరామపురంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సురేష్ రెడ్డి, నాయకులు నెల్లపూడి సుధాకర్, మేనాటి జితేందర్‌రెడ్డి, నెలసరి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా గణనాథుడి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో వినాయక స్వామి

**ముత్తుకూరు, సెప్టెంబరు 22 :** వినాయక చవితి సందర్భంగా మండలంలోని జంగాలకండ్రిగలో ఏర్పాటు చేసి పూజించిన గణనాథుడికి ఆదివారం గ్రామోత్సవం, నిమజ్జనం కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు పేట మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ప్రత్యేక అలంకరణలో వినాయక స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. విశేష పూల అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. తప్పెట్లు తాళాలు బాణాసంచా మోతల మధ్య వినాయక విగ్రహాన్ని కృష్ణపట్నం సముద్రతీరంలో నిమజ్జనం చేశారు.

## ఓ వైపు చెత్త.. మరోవైపు మురుగు

### అధ్వానంగా ఫత్తేఖాన్‌పేట



మురుగుతో మడుగులా మారిన రోడ్డు

నగరానికి నడిబొడ్డున ఉన్న ఫత్తేఖాన్‌పేట చెత్తతో అధ్వానంగా మారింది. ఈ ప్రాంతంలో ఐదు రోజులుగా చెత్త తొలగించడం లేదు. కుండీలు చెత్తతో నిండిపోయాయి. ఆవులు, కుక్కలు చెత్తను కుండీల నుంచి చెల్లాచెదురు చేస్తున్నాయి. ఆదివారం సాయంత్రం వర్షం పడడంతో చెత్తకుండీల వద్ద చిత్తడిగా మారడమే కాక దుర్గంధం వెదజల్లుతోంది. ఇక, నగరంలోని మూలాపేట పెన్షన్‌కాలనీలో ఆదివారం పడిన చిరుజల్లులకే రోడ్లు జలమయమయ్యాయి.



చెత్తకుప్ప

కాలువల్లో నీరు పారుదల లేకపోవడంతో డ్రైనేజీలు వీధులను మురుగు మయం చేశాయి.

- నెల్లూరు (సాంస్కృతికం)

## బిర్జుబాయ్ కుటుంబాన్ని ఆదుకోవాలి



బిర్జుబాయ్ కుటుంబ సభ్యులకు ఫలసరుకులు అందజేస్తున్న ప్రసాద్ తదితరులు

**నెల్లూరు (వెంకటేశ్వరపురం), సెప్టెంబరు 22 :** కుటుంబ పెద్దని కోల్పోయిన బిర్జుబాయ్ కుటుంబాన్ని పెద్ద మనసుతో అందరూ ఆదుకోవాలని బ్లాక్‌బోర్డు మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ కోరారు. వెంకటేశ్వరపురంలోని తన కార్యాలయంలో ఆదివారం బిర్జుబాయ్ కుటుంబానికి నిత్యవసర సరుకులు, బియ్యం అందించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ బిర్జుబాయ్ మరణించడంతో కుటుంబ సభ్యులు జీవించడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల ఐక్యవేదిక అధ్యక్షుడు సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

### వసతి గృహాల్లో
## కొరవడిన పర్యవేక్షణ



ఇందుకూరుపేటలోని బీసీ బాలికల వసతి గృహం

**ఇందుకూరుపేట, సెప్టెంబరు 22 :** మండలంలోని సంక్షేమ హాస్టళ్లు సమస్యలకు నిలయంగా మారాయి. హాస్టళ్లలో విద్యార్థినులపై పర్యవేక్షణ కొరవడింది. ఇందుకూరుపేటలోని బీసీ బాలికల వసతి గృహం వార్డెన్ స్థానికంగా నివాసం ఉండకపోవడంతో వసతి గృహం నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. విద్యార్థినుల మంచి చెడ్డలు చూడడం, వారికి నాణ్యమైన భోజనం అందించడం, మెనూకు తగిన సరుకులు అందించడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. వంట మనుషులు, ఇతర సిబ్బందే అన్నీ చూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. వసతి గృహంలో పిల్లలు భద్రంగా ఉంటారని భావించి పిల్లలను వదిలిన తల్లిదండ్రులు వార్డెన్ లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వార్డెన్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఆకట్టుకున్న సాహితీ సదస్సు

**నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 22 :** రచయిత్రి గోవిందరాజు సీతాదేవి రచనలపై ఆదివారం ఆమె కుమార్తె గోవిందరాజు సుభద్రాదేవి నగరంలోని స్నేహనగర్‌లో సాహితీ సదస్సు ఏర్పాటు చేశారు. సీతాదేవి రచనల్లోని మధ్య తరగతి కుటుంబాల జీవితాలు, ఆత్మీయ అనుబంధాల గురించి చర్చ జరిగింది. సీతాదేవి రచనలైన ఒంటి స్తంభం మేడలో ఒకటిన్నర గది, దేవుడిపెళ్లి, కన్నీటితో కడవలు నిండితే పుస్తకాలపై సాహితీకారులు సమీక్ష జరిపారు. సుభద్రాదేవి మాట్లాడుతూ తన తల్లి నంది అవార్డు అందుకున్నారని తెలిపారు. ఆమె పేరు మీద జాతీయ స్థాయి పోటీలు నిర్వహించి విజేతలకు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మోపూరు పెంచలనరసింహం, లక్ష్మీ భవానీ, చేజర్ల వినయ, కృష్ణవేణి, సుందరి, లలిత, గాయత్రి, లక్ష్మీ, శ్రీలత పాల్గొన్నారు.


## సీతారామ కల్యాణంతో దోషహరణం

- అగస్త్యరాజు సుబ్బారావు

**నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 22 :** శ్రీమద్ రామాయణంలోని సీతారాముల కల్యాణ ఘట్టం చదివినా, విన్నా, చూసిన వారికి పాపాలు హరిస్తాయని సాహిత్యవేత్త అగస్త్యరాజు సుబ్బారావు తెలిపారు. పోలూరి హనుమజ్జానకీ రామశర్మ శత జయంతి సందర్భంగా ఆదివారం రాత్రి పురమందిరం ఏసీ హాలులో జరిగిన 11వ సాహిత్య సభలో ఆయన ప్రసంగించారు. హనుమజ్జానకీరామశర్మ రచించిన శ్రీరామాయణం గ్రంథాన్ని సమీక్షించారు. ఆ గ్రంథాన్ని 10వేల గద్య పద్యాలలో రచించారని తెలిపారు. ఇందులో శ్రీరాముని ధర్మం, పితృవాక్యపాలన, రాజధర్మాలు ఆచరించిన వివరాలు రచించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పద్మకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్ అధ్యక్షత వహించారు. నలబోలు బలరామయ్య, వేదం రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొని సుబ్బారావును ఘనంగా సత్కరించారు.



అగస్త్యరాజు సుబ్బారావుకు సన్మానం





### నెయ్యి కొనుగోళ్లలో రూ.500 కోట్ల స్కాం

టీటీడీ లెక్కల ప్రకారం కిలో నెయ్యి రూ.320. అది కల్తీ నెయ్యి కావడంతో దాని వాస్తవధర రూ.120. దీంతో ఒక కిలోపై రూ.200 పక్కదారి పట్టించారు. ఆ ప్రకారం మూడేళ్లలో కేవలం నెయ్యి కొనుగోళ్లలోనే దాదాపు రూ. 500 కోట్ల కుంభకోణం జరిగింది. చిరుతను తరిమేందుకు అప్పటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కర్రలను తెప్పించడంలోనూ భారీ స్కాం జరిగింది. వీటిపై శ్రీవారి భక్తులు ఆందోళన చేపట్టాలి.



- కిరణ్ రాయల్, జనసేన తిరుపతి ఇన్‌చార్జి

### సంప్రోక్షణతో శుద్ధి చేసేశాం

కల్తీ నెయ్యి దోషాన్ని ఆగస్టులో సంప్రోక్షణతో పోగొట్టి శుద్ధి చేశాం. దీనిపై భక్తులకు ఎలాంటి అపోహలు వద్దు. ఇంకా కొందరిలో ఆందోళనలు ఉండటంతో సోమవారం ఉదయం శాంతిహోమం చేస్తున్నాం. ఇప్పుడు పేరున్న సంస్థల నుంచే స్వచ్ఛమైన ఆవు నెయ్యి కొని లడ్డూ ప్రసాదాలు తయారు చేస్తున్నాం. తిరుమలలో ఇది వరకు నెయ్యిలో జంతువుల కొవ్వు ఉందా లేదా అనే పరీక్షలు జరగలేదు. ఇక్కడ సాధారణ పరీక్షల సామర్థ్యమే ఉంది.



- శ్యామలరావు, టీటీడీ ఈవో



### నెయ్యి కల్తీ అంటూ కుట్ర

మా పాలనలో టీటీడీలో ఏవేవో జరిగిపోయాయని చంద్రబాబు విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. ఏ ఆధారాలూ దొరక్క పోవడంతో నెయ్యి కల్తీ అంటూ కుట్ర చేస్తున్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై కల్తీ ముద్ర వేసి అపచారానికి పాల్పడ్డారు. ఒకవేళ తిరుమల లడ్డూ కల్తీ జరిగుంటే బాధ్యులు రక్తం కక్కుకుని చావాలని శ్రీవారిని కోరుకుంటున్నా.



- భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్

### పవిత్రత గురించి ఆయన మాట్లాడటమా?

నల్లరాయిని చెప్పుతో కొట్టండని గతంలో మాట్లాడిన వ్యక్తి టీటీడీ చైర్మన్ అయ్యారు. తన కుమారుడిని ఎమ్మెల్యేని చేసేందుకు పనుల పేరిట టీటీడీ నిధులు దుర్వినియోగం చేశారు. అలాంటాయన పవిత్రత గురించి మాట్లాడటమా? వారి పాలనలో అక్రమాలు జరిగుంటే నెత్తురు కక్కుకొని చస్తామని ఆయన చెప్పారు. ఆ శిక్షనూ దేవుడు త్వరలోనే వేస్తాడు. శ్రీవారి పవిత్రతను కాపాడినందుకే బాంబుదాడి నుంచి చంద్రబాబును దేవుడు రక్షించాడు.



- నరసింహయాదవ్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు

### శ్రీవారి లడ్డూ కల్తీ బాధాకరం

'తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని ఎంతో పవిత్రంగా భావిస్తాం. కళ్లకద్దుకుని తీసుకుంటాం. అలాంటి లడ్డూ అపవిత్రమైందని తెలిసి ఎంతో బాధ కలిగింది. లడ్డూ కల్తీ వ్యవహారం భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. దీనికి కారకులైన వారిని శిక్షించాలి' అని సినీ నటుడు బాలాజీ కోరారు. హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే దేనినీ సహించబోమన్నారు. ఈ మేరకు ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన టీడీపీ నేత జగన్నాథం తదితరులతో కలిసి మీడియాతో మాట్లాడారు.

- తిరుపతి(లీలామహల్)



ప్లకార్డు చూపుతున్న సినీ నటుడు బాలాజీ తదితరులు



ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు



మృతిచెందిన బాబు



మృతిచెందిన జగదీశ్వర్



మృతిచెందిన వెన్నెలమేఘన

# అయ్యో.. దేవుడా..!

- పుణ్యక్షేత్రాలను దర్శించుకుని వస్తుండగా ప్రమాదం
- ఆగి ఉన్న లారీని కారు ఢీకొని ముగ్గురి మృతి
- ఏడుగురికి గాయాలు

**మృతులు, క్షతగాత్రులు నెల్లూరు వాసులే**



చికిత్సపొందుతున్న లక్ష్మమ్మ, కిషోర్‌బాబు

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఇద్దరు స్నేహితులతో కలిసి ఆ కుటుంబం పుణ్యక్షేత్రాలను దర్శించుకుని తిరుగు ప్రయాణమైంది. మరో అరగంటలో గమ్యం చేరనున్న క్రమంలో చిల్లకూరు వద్ద అదుపు తప్పిన వీరి కారు ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో నెల్లూరుకు చెందిన ముగ్గురు మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు.



గాయపడిన కళ్యాణి

పోలీసులు తెలిపిన ప్రకారం.. నెల్లూరురూరల్ మండలం కాకుపల్లి గ్రామానికి చెందిన గోనెల బాబు(50), అతడి భార్య లక్ష్మమ్మ చిన్నపాటి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరికి కిషోర్‌బాబు, కళ్యాణి, మాధవి పిల్లలు. వీరిలో కళ్యాణి నెల్లూరులోని వనంతోపులో ఉండగా, ఆమెకు వెన్నెల మేఘన(8), జశ్వంత్ పిల్లలు. ఈ కుటుంబ సభ్యులు, తమ సమీప బంధువు రాధాకుమారి, నెల్లూరుకే చెందిన బాబు కుటుంబ స్నేహితులైన సునీల్‌కుమార్, జగదీశ్వర్(45) కలిసి ఈనెల 18న పుణ్యక్షేత్రాల సందర్శనకు సునీల్‌కుమార్ కారులో వెళ్లారు. కాణిపాకం, కంచి, అరుణాచలం పుణ్యక్షేత్రాలకు వెళ్లి దైవదర్శనం చేసుకుని తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం వేకువన చిల్లకూరు పోలీస్‌స్టేషన్ ఎదురుగా వచ్చే సమయానికి కారు అదుపుతప్పి రోడ్డు పక్కన నిలిపి ఉన్న కంటైనరు లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో తాత, మనవరాలైన బాబు, వెన్నెల మేఘన, జగదీశ్వర్ మృతిచెందారు. లక్ష్మమ్మ, మాధవి, కళ్యాణి, కిషోర్‌బాబు, రాధాకుమారి, సునీల్‌కుమార్, జశ్వంత్‌లకు గాయాలయ్యాయి. వీరికి గూడూరు ఏరియా ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందాఇంచి.. మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు. సంఘటనా స్థలాన్ని సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్ పరిశీలించారు. ఈ మేరకు ఎస్ఐ సురేష్‌బాబు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



సంఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా, డీఎస్పీ రమణకుమార్

'చిత్తూరు-తచ్చూరు' ఎక్స్‌ప్రెస్‌వే

# బాధితుల్లో నేనూ ఒకడిని



కారూరు గ్రామం వద్ద ఎక్స్‌ప్రెస్ వే పై వంటావార్పు కార్యక్రమంలో నారాయణ తదితరులు

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

పిచ్చాటూరు, సెప్టెంబరు 22: చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే బాధితుల్లో తానూ ఒకడినని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు.పిచ్చాటూరు మండలం కారూరు గ్రామం వద్ద ఆదివారం స్థానిక రైతులతో కలసి హైవేపై ధర్నా నిర్వహించారు. అధికారులు హైవేకు భూములు ఇచ్చిన రైతులకు అన్యాయం చేస్తున్నారంటూ రోడ్డుపై వంటావార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడారు. 'నగరి మండలంలోని అయనంబాకంలో నా రెండెకరాల భూమిని ఎక్స్‌ప్రెస్ వేలో కోల్పోయా. మన ప్రాంతంలో ఎక్స్‌ప్రెస్ వే వస్తుండడంతో ఆనందపడి భూములిచ్చా. తీరా రైతులకు, గ్రామానికి వెళ్లే ప్రయాణికులకు తీరని నష్టం చేకూర్చారు. పొలాలకు వెళ్లాలంటే దారి సౌకర్యం లేదు. ఎక్స్‌ప్రెస్ వే కొండలా అడ్డంగా ఉంది. చెరువు నుంచి నీళ్లు వచ్చే కాలువలను కాంట్రాక్టర్లు పూడ్చి వేశారు. గ్రామస్తులకు, రైతులకు కలిగే అసౌకర్యాలపై నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ కార్తీక్ దృష్టికి తీసుకెళ్లా. ఢిల్లీ స్థాయి అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని కోరా. స్థానికులకు న్యాయం జరిగే వరకు ఈ పోరాటం ఆగదు. కారూరు గ్రామం వద్ద సర్వీస్ రోడ్డు, సబ్‌వే, కూల్చిన డంపింగ్ యార్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి. రోడ్డు వెంబడి గ్రామాల వద్ద అండర్ పాస్, ఫ్లై ఓవర్లు నిర్మించే వరకు అంచలంచెలుగా పోరాటం చేస్తూనే ఉంటా' అని స్పష్టంచేశారు. సీపీఐ నాయకులు చిన్నిరాజు, హరికృష్ణ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### వాహనం ఢీకొని కాలినడక భక్తురాలి మృతి

పాకాల, సెప్టెంబరు 22: పాదయాత్రగా తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తున్న తమిళనాడుకు చెందిన భక్తబృందంలోని ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీకొంది. అక్కడికక్కడే ఆమె మృతిచెందారు. పాకాల మండలం శంఖంపల్లె ఆంజనేయస్వామి ఆలయ సమీపాన ఆదివారం తెల్లవారుజామున ఈ ఘటన జరిగింది. వేలూరు జిల్లా గుడియాత్తం మండలం నుంచి భక్తబృందం శనివారం రాత్రి ఆలయ ఆవరణలో సేదతీరింది. ఆదివారం తెల్లవారుజామున కాలినడక ప్రారంభించగా.. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తాటిమానుపల్లెకు చెందిన సరళ అక్కడికక్కడే మృతిచెందారు. భర్త జయపాల్‌తో కలిసి ఈమె 23 ఏళ్లుగా కాలినడకన తిరుమలకు వస్తున్నారు. కళ్లముందే భార్య మృతి చెందడంతో ఆయన కన్నీరుమున్నీరయ్యారు. సీఐ మద్దయ్య ఆచారి, ఎస్ఐ మహేష్‌బాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సరళ మృతదేహం వద్ద విషణ్ణ వదనాలతో భక్తులు

# వైభవంగా ఘటోత్సవం



జనసందోహం నడుమ ఊరేగుతున్న ఘటుం కుండలు

వెంకటగిరి, సెప్టెంబరు 22 వెంకటగిరిలో బుధ, గురువారాల్లో నిర్వహించే పోలేరమ్మ జాతరకు కీలక ఘట్టంగా భావించే ఘటోత్సవం ఆదివారం జరిగింది. ఉదయం 10 గంటల సమయంలో కాంపాళెం వద్ద రెడ్డిగారి సాంగ్యంగా చెప్పుకొనే అమ్మవారి బలి దున్నపోతును పనిబాటలవారికి అప్పగించారు. మధ్యాహ్నం కుమ్మరి వారి పుట్టినింటిసాంగ్యంగా అమ్మవారి అత్తింటివారైన చాకలివారికి రెండుకుండలు, దీపం పట్టే మూకుడిని అప్పగించారు. వీటిని అమ్మవారి అత్తవారిల్లుగా భావించే జీనిగుల వారి వీధిలోని చాకలింట వడ్లను పోసి వాటిపై ఘటుంకుండలను కొలువుతీర్చారు. బలిజ సామాజిక, పత్రోళ్ల తొలిపూజ చేశారు. అనంతరం మండపం ముందు అమ్మవారి ప్రతిరూపంగా భావించే బలిదున్న పోతుకు స్నానం చేయించి పూజలు చేసి పసుపు గుడ్డను కప్పారు. ఘటుం కుండలకు భక్తులు పూజలు చేసి అంబలి, పెరుగన్నం, బెల్లపు గడ్డలు, పొంగలిని వీటిలో వేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ప్రాంతమంతా ఆసాదుల తప్పెట్లు, యువత కేరింతలతో హోరెత్తింది. అనంతరం ఘటుం కుండలను చాకలివారు నెత్తిన పెట్టుకొని.. ముందు బలి దున్నపోతును ఈ ఎడాది వాహనంపై ఎక్కించి ఊరేగింపుగా పోలేరమ్మ దేవస్థానం వద్దకు తీసుకొచ్చారు. అమ్మవారికి బలిదున్న పోతును చూపి పూజలు చేశారు. తిరిగి ఘటుం కుండలు, బలి దున్నపోతు ఊరేగింపు మొదలైంది. అప్పటి రాజాల వంటశాల వద్ద వడ్లను పోసి వాటిపై ఘటుం కుండలు కొలువు తీర్చారు. నగరినుంచి వచ్చిన సారెలతో వచ్చిన రాజాల అనుచరులు కుండలకు పూజలు చేశారు. ఘటుంకుండల దర్శనానికి యువత పోటీ పడటంలో కొంత తోపులాట జరిగింది. ఇక్కడ్నుంచి బయలుదేరి పట్టణంలో తొలిసారిగా తాటిపర్తి వారింటికి చేరుకోగా.. అక్కడ చాకలివారి కాళ్లు కడిగి ఘటుంకుండలకు పూజలు చేశారు. అక్కడ్నుంచి అనవాయతీగా వెళ్తున్న ఇళ్లకు ఘటుంకుండలు వెళ్లడం పూజలందుకోవడం సంప్రదాయం. ఇలా మూడు రోజులపాటు ఘటుంకుండలు, బలిదున్నపోతు ఊరిలో తిరుగుతూ పూజలందుకుంటాయి. ఈ ఘటోత్సవానికి ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరై ఊరేగింపులో చిందులు వేశారు, సీఐ ఏవీ రమణ, ఎస్ఐ సుధాకర్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

- ఎప్పుడూ లేనివిధంగా ఈ ఏడాది బలిదున్న పోతు, ఘటుం కుండలను వాహనంపై ఊరేగింపునకు తీసుకురావడం విమర్శలకు తావిచ్చింది. సంప్రదాయాన్ని పక్కన పెట్టారంటూ బలిదున్న పోతు ఎక్కించిన వాహనాన్ని కొందరు అడ్డుకొన్నారు.
- రాజాల వంటశాల వద్దకు బలి దున్నపోతును ఈ ఏడాది తీసుకు రాలేదు. ఈ ఆచారానికి మంగళం పాడారు.
- ఘటోత్సవంలో ఆకతాయిల ఆగడాలతో మహిళలు ఇబ్బందులు పడ్డారు.



వాహనంలో ఊరేగుతున్న అమ్మవారి బలి దున్నపోతు

# అప్పుడు.. ఇప్పుడూ వాళ్లే!

**వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు రుయాస్పత్రిలోని దుకాణాలను గుట్టుచప్పుడు కాకుండా టెండరు పేరుతో తమ విధేయులకే కట్టబెట్టారు. దీనికిగాను ఒక్కో దుకాణదారుడి నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్లు అప్పట్లో విమర్శలు వచ్చాయి.**

ఇటీవల కూటమి అధికారంలోకి వచ్చింది. వెంటనే వైసీపీలోని ఓ యువనేత తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ప్రసన్నం చేసుకుని జనసేనలో చేరిపోయారు. వెంటనే రుయాలో కమిటీ పదవి పొందారు. నాలుగు రోజుల కిందట జరిగిన హెచ్‌డీఎస్ సమావేశంలో తొలిసారి పాల్గొన్నారు. ఆ వెంటనే తన అనుచరుల ద్వారా ఓ దుకాణాన్ని ఆక్రమించేశారు. అడ్డుకున్న అధికారులను ఎమ్మెల్యే పేరు చెప్పి బెదిరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు సాగిన దందాను ఇప్పుడూ కొనసాగిస్తున్నారు.



- రుయాస్పత్రిలో రాత్రికి రాత్రే దుకాణం ఆక్రమణ
- వైసీపీ నుంచి జనసేనలో చేరిన నేత అండతో దాష్టీకం
- అడ్డుకున్న అధికారులకు ఎమ్మెల్యే పేరిట బెదిరింపులు

రుయాస్పత్రిలోని సూపరింటెండెంట్ గది వెనుక 2000వ సంవత్సరంలో రెడ్డెప్ప ఒక చిన్న బంకు పెట్టుకొని జీవనం సాగించారు. కొన్నాళ్లకు ఆయన ఆరోగ్య పరిస్థితి బాగోలేక ఆ దుకాణాన్ని కృష్ణమూర్తికి సబ్‌లీజు కింద ఇచ్చారు. ఐదేళ్ల కిందట రెడ్డెప్ప మృతిచెందగా.. సబ్‌లీజుకు తీసుకున్న కృష్ణమూర్తికి చెందిన వారే ఆ బంకులో వ్యాపారం చేసుకునేవారు.టెండర్లు, నిబంధనలు లేకుండా కొనసాగుతున్న దుకాణాలను రద్దుచేసి 2022లో కొత్తగా టెండరు కింద కేటాయించారు. ఆ సమయంలో ఈ బంకును టెండరు కింద తేజ్‌ప్రకాశ్ దక్కించుకున్నారు. వ్యక్తిగత కారణాలతో ఆయన వ్యాపారం మొదలు పెట్టలేదు.అప్పట్నుంచి ఆ దుకాణం ఖాళీగా ఉంది. దీంతో కృష్ణమూర్తి కోర్టును ఆశ్రయించి ఆ దుకాణంపై రెడ్డెప్ప పేరిట స్టే తీసుకొచ్చారు. రెడ్డెప్ప మృతిచెందడం.. ఆయనకు వారసులు లేకపోవడంతో ఆ స్టే చెల్లదని అప్పట్లోనే అధికారులు తేల్చిచెప్పేశారు. అప్పట్నుంచి ఆ దుకాణం ఖాళీగా ఉంది.పక్క దుకాణాల వారు ఇక్కడ ఫ్రిజ్‌లు, ఇతర వస్తువులను పెట్టుకునేవారు. రెండు రోజుల కిందట రెడ్డెప్ప వారసులమంటూ జనసేన యువనేత (ఇటీవల వైసీపీ నుంచి చేరిన వ్యక్తి) అనుచరులు కొందరు ఆ దుకాణాన్ని ఒకే రాత్రిలో ఆక్రమించేశారు. అందులోని తమ వస్తువులు ఇవ్వాలని పక్క దుకాణదారులు ప్రాధేయపడినా ఇవ్వలేదు. మరుసటి రోజు నుంచే వ్యాపారం మొదలు పెట్టారు.

#### దీని జోలికొస్తే ఇబ్బందులు తప్పవంటూ..

రుయాస్పత్రిలోని దుకాణాన్ని కొందరు ఆక్రమించారని తెలిసి అధికారులు అక్కడకు వెళ్లారు. 'ఎవరు మీరు. దుకాణంలో ఎందుకు ఉన్నారు' అని అడగ్గా ఏదైనా ఉంటే ఎమ్మెల్యేతో మాట్లాడండంటూ దుకాణంలోని వారు చెప్పారు. దుకాణంలోని వాళ్ల సమాచారంతో జనసేనలోని యువనేత అక్కడికి వచ్చారు. 'వాళ్లు మన వాళ్లే. మీరు సపోర్టు చేయండి. ఏదైనా ఉంటే ఎమ్మెల్యేతో మాట్లాడతా. లేకపోతే ఇబ్బందులు తప్పవు' అంటూ ఆయన సున్నితంగా అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. దుకాణం కావాలంటే వచ్చే నెలలో టెండర్లు పిలుస్తామని అప్పుడు దక్కించుకోవాలే కానీ, ఇలా ఆక్రమించడం నేరమని అధికారులు చెప్పారు. ఆ టెండర్లో దుకాణాలన్నీ తమకే వస్తాయని, ప్రస్తుతానికి దీని జోలికి రావద్దని, వస్తే ఇబ్బందులు తప్పవని గట్టిగా మందలించడంతో అధికారులు వెనుదిరగాల్సి వచ్చింది. రెండు రోజులుగా ఆక్రమించిన దుకాణంలో వ్యాపారం సాగుతోంది.

- తిరుపతి (వైద్యం)

#### ఖాళీ చేయమన్నా లెక్క చేయడంలేదు

ఈ విషయంపై సూపరింటెండెంట్ రవిప్రభును వివరణ కోరగా.. 'మాకు తెలియకుండా దుకాణం ఆక్రమించిన మాట వాస్తవమే. వెంటనే ఖాళీ చేయాలని ఆదేశించినా.. వాళ్లు లెక్క చేయలేదు. ఎప్పుడో మృతిచెందిన వ్యక్తి పేరుతో ఉన్న కోర్టు స్టేని చూపుతున్నారు. చట్టపరంగా ఆ దుకాణానికి, వీళ్లకు ఎటువంటి సంబంధం సంబంధం లేదు. వెంటనే ఖాళీ చేయకపోతే పోలీసులకు ఫిర్యాదు చేసి వారి సాయంతో ఆక్రమణదారులను వెళ్లగొట్టి దుకాణం స్వాధీనం చేసుకుంటాం.

# కామిరెడ్డి ఆరోపణలు అర్థరహితం

## నెయ్యి కల్తీలో దోషులు తప్పించుకోలేరు: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

పెళ్లకూరు, సెప్టెంబరు 22: కలియుగ దైవం వెంకటేశ్వరస్వామి ప్రసాదమైన లడ్డూలకు వినియోగించే ఆవు నెయ్యిలో జరిగిన కల్తీనీ తప్పిపుచ్చుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుపై వైసీపీ నేత కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అర్థ రహితమైన ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడు పేర్కొన్నారు. ఆదివారం పెళ్లకూరులో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుజరాత్‌లోని జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ టీటీడీ పంపిన నెయ్యిలో కల్తీ జరిగిందని నిర్ధారించిన విషయాన్నే ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారని గుర్తు చేశారు. వాస్తవాలు తెలుసుకోకుండా కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి టీటీడీ మాజీ చైర్మన్లను వెనకవేసుకొస్తూ సీఎంపై అర్థ రహిత ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి తప్పుడు ఆరోపణలను కామిరెడ్డి మానుకోవాలని, లేకుంటే ప్రభుత్వం తీసుకునే చర్యలతో పాటు ప్రజల ఆగ్రహాలకు గురి కావల్సివస్తుందని హెచ్చరించారు. సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ పెళ్ళకూరు మండలం పునబాకలోని వైష్ణవి డెయిరీ నుంచి టీటీడీకి నెయ్యి సరఫరా చేసే టెండర్ దక్కడంలో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి హస్తం ఉన్నట్లుందని ఆరోపించారు. ఆ దేవదేవుడికి శఠగోపం పెట్టిన టీటీడీ బోర్డు మాజీ చైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్‌రెడ్డి, మాజీ ఈవో ధర్మారెడ్డి తప్పించుకోలేరన్నారు. తిరుమల కొండను అవినీతి అక్రమాలను వేదికగా చేసుకున్న వైసీపీ నాయకులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. కార్యక్రమంలో లక్ష్మీపతి నాయుడు, హరి నాయుడు, మురళీనాయుడు తదితరులు ఉన్నారు.

## సీజేఎఫ్‌ఎస్‌లను రద్దు చేశారు.... పట్టాలు ఇవ్వలేదు

బాలాయపల్లి, సెప్టెంబరు 22: మండలంలోని పేదలకు జీవనోపాధి కోసం గతంలో ప్రభుత్వం సీజేఎఫ్ఎస్ భూములను పంపిణీ చేసింది. ఈ భూముల్లో పంటలు సాగు చేసుకోవడం తప్ప ఎలాంటి రుణాలు పొందలేని పరిస్థితి. దీంతో కొందరు సాగు చేసుకునేందుకు డబ్బులు లేక భూములను బీడుగా వదిలేశారు. మరికొందరు అప్పు చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు. భూములున్నా పెట్టుబడులకు డబ్బులు లేక పంటలు సాగుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించిన ప్రభుత్వం 2018లో సీజేఎఫ్ఎస్ రద్దు చేసి అసైన్డ్ పట్టాలు మంజూరు చేసేందుకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో మండలంలోని సీజేఎఫ్ఎస్ సొసైటీలను రద్దు చేసింది. అయితే రద్దు చేసిన సీజేఎఫ్ఎస్ భూములు రికార్డుల్లో అటవీశాఖకు చెందినవిగా నమోదై ఉండడంతో అంబలపూడి, అరిగేపల్లి, చిలమనూరు, చుట్టి, గొల్లగుంట, జయంపు, నిడిగల్లు, పెరిమిడి, సుబ్రమణ్యం, ఊట్లపల్లి, కడగుంట గ్రామాల ప్రజలకు పట్టాలు మంజూరును నిలిపివేశారు. సీజేఎఫ్ఎస్ రద్దుతో ఎంతోకాలంగా సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కోల్పోయామని, అయితే అసైన్డ్ పట్టాలు కూడా ఇవ్వకపోవడంతో తాము జీవనోపాధి కోల్పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని తమకు పట్టాలు మంజూరు చేసి హక్కులు కల్పించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి, సంక్షేమం



చిల్లకూరులో కరపత్రాలను అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిల్లకూరు, సెప్టెంబరు 22: ఎన్డీఏ కూటమి ప్రభుత్వంతోనే పేదలకు సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి చిరంజీవి అన్నారు. ఆదివారం మండలంలోని కలవకొండ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తయిన సందర్భంగా ఇప్పటి వరకు జరిగిన అభివృద్ధి పనులు, సంక్షేమం గురించి వివరించారు. విజయవాడలో వరదల సమయంలో బాధితులకు అందుబాటులో ఉంటూ వారి ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్న నాయకుడు చంద్రబాబు అన్నారు. కార్యక్రమంలో సుప్రజ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక వడ్డిపాళెం, గొల్లపాళెం ప్రాంతాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో చిల్లకూరు పట్టాభిరామిరెడ్డి, కొండా రామచంద్రారెడ్డి, దాసరి రామ్‌ప్రసాద్, బెల్లంకొండ శివ, మల్లికార్జున్, నవీన్‌చంద్ర, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో ఉపాధ్యాయులు

గూడూరు, సెప్టెంబరు 22: స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ యూటీఎఫ్ స్వర్ణోత్సవాల్లో భాగంగా క్రీడాపోటీలను నిర్వహించడం జరిగిందన్నారు. గెలుపొందిన వారు ఈనెల 29న తిరుపతిలో జరిగే జిల్లాస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో సుధీర్, రవి, మురళీసింగ్, మురళీమోహన్, నాగేశ్వరరావు, ప్రాణేష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఆహార పొట్లాల అందజేత

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 22: నాయుడుపేటలోని రైల్వేస్టేషన్, బస్టాండ్, దేవాలయాలు, ముఖ్య కూడలి ప్రాంతాల్లో పేదలకు తడ కండ్రిగకు చెందిన శ్రీకృష్ణ ఫౌండేషన్ నిర్వాహకుడు నాగరాజు ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. తూర్పు గోదావరి జిల్లా మేరీ గ్రామానికి చెందిన చింత చిదానందరావు, చింత వీరభద్రయ్య వారి తండ్రి సూర్యనాగేశ్వరరావు జ్ఞాపకార్థంగా ఆహారాన్ని అందజేసినట్లు తెలిపారు.



## మ్యూజికల్ నైట్



వెంకటగిరిటౌన్, సెప్టెంబరు 22: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరలో భాగంగా ఆదివారం రాత్రి మ్యూజికల్ నైట్ నిర్వహించారు. ప్రముఖ గాయకులు తమ పాటలతో అలరించారు.

## తిరుమల పవిత్రతను భ్రష్టుపట్టించారు

కోట, సెప్టెంబరు 22: తిరుమలను వైసీపీ నాయకులు భ్రష్టుపట్టించారని, ఆ పాపం ఊరికేపోదని టీడీపీ జిల్లా కార్యదర్శి తీగల సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కోటలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కలియుగ దైవమైన వెంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూలో కల్తీ నెయ్యి వినియోగించడం క్షమించరాని నేరమన్నారు. అందుకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం నిర్వాకం వల్ల ప్రపంచవ్యాప్తంగా భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

చిల్లకూరు, సెప్టెంబరు 22: మండలంలోని బూదనం టోల్‌ప్లాజా సమీపంలో ఆదివారం వేకువజామున గుండె పోటుతో లారీ డ్రైవర్ మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు... తమిళనాడులోని సేలం జిల్లా కట్టుబొట్టాయ్ గ్రామానికి చెందిన లారీడ్రైవర్ మురగవేల్(35), అతని బావమరిది మణికందన్ సేలం నుంచి కోల్‌కతాకు టెంకాయల లోడు బయలుదేరారు. బూదనం టోల్‌ప్లాజా వద్ద ఆపి లారీపై కప్పిన పట్టను సరిచేసుకుని తిరిగి మళ్లీ బయలుదేరడానికి సిద్ధమయ్యారు. ఇంతలో మురగవేల్ గుండెనొప్పిగా ఉందంటూ అస్వస్థతకు లోనయ్యాడు. వెంటనే గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## వైద్య శిబిరాలతో పేదలకు ప్రయోజనం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 22: వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పేదలకు ప్రయోజనకరంగా ఉంటుందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె సందర్శించారు. కార్యక్రమంలో నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, పార్థసారథి, వైస్ చైర్మన్ షేక్ రఫీ, నాయకులు పొట్లపూడి రాజేష్, చంద్రశేఖర్, శివ, చక్రపాణి పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధికి చెక్కు అందజేత

గూడూరు, సెప్టెంబరు 22: పట్టణానికి చెందిన మొబైల్ కమ్యూనికేషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేల చెక్కును ఆదివారం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు అందజేశారు. కార్యక్రమంలో రామ్మోహన్‌రావు, రాజా, తేజ తదితరులు పాల్గొన్నారు.





శిథిలావస్థలో చిట్టేడులోని బీసీ బాలుర వసతిగృహం మరుగుదొడ్ల దుస్థితి - కిటికీలకు తలుపులు లేని దృశ్యం

# నరకానికి నకళ్లు... బీసీ హాస్టళ్లు

కోట, సెప్టెంబరు 22: బీసీ సంక్షేమ వసతి గృహాలు శిథిలావస్థలోకి చేరుకున్నాయి. ఆయా శిథిల భవనాల్లో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా బీసీ వసతిగృహాలు మళ్లీ ఉరుస్తాయేమోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కోట మండలంలో చిట్టేడులో బీసీ బాలుర, నెల్లూరుపల్లి కొత్తపాళెంలో బీసీ బాలుర, కోటలో బీసీ బాలురు, బాలికల వసతిగృహాలు ఉన్నాయి. వీటిల్లో వందలాది మంది విద్యార్థులు ఉన్నారు. చిట్టేడు వసతిగృహంలో 3నుంచి 10 తరగతుల వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇక్కడ శిథిలావస్థలో ఉన్న భవనంలోనే సగభాగం వార్డెన్, దాతల సహకారంతో తాత్కలిక మరమ్మతులు చేసి విద్యార్థులను ఉంచుతున్నారు. వర్షానికి ఉరుస్తుండడం, కిటికీలు సక్రమంగా లేకపోవడం, మరుగుదొడ్లు పూర్తిగా దెబ్బతినడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం వస్తే ఈ భవనంలో ఉండాలంటేనే విద్యార్థులు హడలిపోతున్నారు. అదేవిధంగా నెల్లూరుపల్లి కొత్తపాళెంలో ఉన్న బాలుర వసతి గృహం కూడా ఉరిసే పరిస్థితిలో ఉండటంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీసీ సంక్షేమ హాస్టళ్లకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

# ఎన్డీఏ కూటమిది రామరాజ్య పాలన: పాశిం





కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

చిట్టమూరు, సెప్టెంబర్ 22: రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి రామరాజ్యం పాలన సాగిస్తోందని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు గణపర్తి కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం చిట్టమూరు జడ్పీ హైస్కూల్లో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా గణపర్తి సుబ్రహ్మణ్యం నాయుడు వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్దకు చేరుకొని నివాళులర్పించారు. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో గూడూరు నియోజకవర్గంలో రూ.2200 కోట్లతో అభివృద్ధి చేశానన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం చిన్న పని కూడా చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వంద రోజుల్లో రూ.2కోట్లతో మండలంలో సిమెంట్ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. రూ.5.33 కోట్లతో బయ్యవారికండ్రిగ నుంచి కొండాపురం రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ ఒకొ క్కటిగా అమలు చేస్తూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. వ్యవస్థలను నాశనం చేసిన జగన్ ప్రభుత్వం ప్రతి శాఖలోనూ కోట్ల రూపాయలు దోపిడీ చేసిందని ఆరోపించారు. ప్రధాని మోదీ అండ, చంద్రబాబు అనుభవం, పవన్‌కల్యాన్ సహకారంతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకపోతోందన్నారు. త్వరతో ఆడపడుచులకు ఉచితంగా మూడు గ్యాస్ సిలండర్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి పథకం పార్టీలకతీతంగా ప్రతి పేదవాడికీ అందజేయాలని అధికారులను, నాయకులను కోరారు. మహాపుణ్య క్షేత్రమైన తిరుమల వేంకటేశ్వరస్వామి ప్రసాదం లడ్డూలో జంతువుల కొవ్వు కలిసిన నెయ్యి వినియోగించడం మహాపాపమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాలెడ్, తహసీల్దారు ప్రసాద్, సర్పంచులు రాజేష్‌రెడ్డి, కోటయ్య, టీడీపీ నాయకులు జనార్దనరెడ్డి, హరికృష్ణారెడ్డి, దువ్వూరు భారతమ్మ, గిరినాయుడు, చెంచురామయ్య, అనురాధ, చిన్నారావు, బీజేపీ మండల కన్వీనర్ శరత్‌చంద్రారెడ్డి, జనసేన నాయకుడు క్రాంతి, నాగార్జున, అంకబాబు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు అండగా చంద్రన్న ప్రభుత్వం: విజయశ్రీ



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

తడ, సెప్టెంబరు 22: చంద్రన్న ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. ఆదివారం తడ మండలం వాటంబేడు గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేసి సిక్కర్లను అంటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న మంచినీళ్ల, డ్రైనేజీ సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. భారీ వర్షాలకు విజయవాడ నగరం ముంపునకు గురైందని, ఆ సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటిని వదిలి కలెక్టర్ కార్యాలయాన్నే సచివాలయంగా మలుచుకొని బాధితులకు అండగా నిలిచారని కొనియాడారు. నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ మాటఇస్తే నేరవేర్చడం చంద్రబాబుకే సాధ్యమని, ఎన్నికల్లో హామీ ఇచ్చిన సూపర్ సిక్స్‌ను అమలు చేసిన ఘనత ఆయనదే అన్నారు. అలాగే ఇరకం దీవిలో జరిగిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో మత్స్యకార నాయకులు జయపాల్, వాసు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్, నాయకులు మురళీరెడ్డి, పార్థసారథి, పళణి, శ్రీనివాసన్, సెల్వం, రవి, మాధవ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రముఖులకు ఎమ్మెల్యే ఆహ్వానం



మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి దంపతులను జాతరకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కురుగొండ్ల

వెంకటగిరి, సెప్టెంబరు 22: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతరకు హజరు కావాలంటూ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, ఆయన సతీమణి కోవూరు ఎమ్మెల్యే ప్రశాంత రెడ్డిలను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం వారి నివాసాలకు వెళ్లి ఆహ్వానించారు.

## సమస్యల పరిష్కారానికి కృషి

గూడూరు, సెప్టెంబరు 22: బలిజ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి బలిజ ఉద్యోగుల అభ్యుదయ సేవాసమితి కృషి చేస్తుందని ఆ సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక త్యాగరాజవీధిలోని ఓ ప్రైవేటు ఫక్షన్ హాలులో ప్రభుత్వం నుంచి ఉత్తమ సేవా అవార్డులు పొందిన బలిజ ఉద్యోగులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్థులకు ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా నాయకత్వం దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, మునిశేఖర్, సత్యనారాయణ, బాలసుబ్రమణ్యం, రవీంద్రబాబు, శేషయ్య, కళ్యాణ్ సాయి, ఎంవీ రమణయ్య, పవన్‌కుమార్ పాల్గొన్నారు.

## పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 22: వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర పోస్టర్లను ఎన్వీఆర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రస్టు చైర్మన్ వెంకటేశ్వర్లు, పునుగోటి విశ్వనాథం, మురళీకృష్ణ పాల్గొన్నారు.

## వృద్ధ దంపతులకు బలిజ సంఘం చేయూత

నాయుడుపేట, సెప్టెంబరు 22: ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్న జానకీరామయ్య, రాజేశ్వరమ్మ దంపతులకు బలిజ ఐక్యవేదిక సంఘ నాయకులు చేయూత అందించారు. ఆదివారం వృద్ధ దంపతులకు రూ.15వేల నగదు, దుస్తులు, మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు ఏవీ కుమార్, ఆకుల కుబేరు మణి, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, గిరి, జయప్రకాష్, సురేంద్ర, శేషగిరి, రోహిణి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## కరపత్రాల పంపిణీ



చిల్లకూరులో కరపత్రాలను అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి తదితరులు

పెళ్లకూరు, సెప్టెంబరు 22: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తవడంతో మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమాన్ని నిర్వహించారు. కొత్తూరులో టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, పెళ్లకూరులో సీనియర్ నాయకుడు పేరం రమేష్ నాయుడు, బంగారంపేటలో దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, వెంకటసుబ్బయ్య, భీమవరంలో దామెర ప్రసాద్‌నాయుడు, జీలపాటూరులో కందమూడి శివకుమార్, చిల్లకూరులో పాపాడి రాజగోపాల్‌రెడ్డి, పునబాకలో వేలూరు హరినాయుడు, తాళ్ల యుగంధర్, రోసనూరులో దొమ్మరాజు సత్యంరాజు తదితరులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు.

**ఓజిలి:** మండలంలోని 10 సచివాలయాల పరిధిలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. అధికారులు ఇంటింటా పర్యటించి కూటమి ప్రభుత్వం వంద రోజుల పరిపాలనలో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. ఈకార్యక్రమాలను ఎంపీడీవో రజనీకాంత్ పర్యవేక్షించారు. అలాగే కురుగొండ సచివాలయం పరిధిలో ఎంఈవో చంద్రశేఖర్ అధికారులతో కలసి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 22: రాష్ట్రప్రభుత్వం కార్మికులు, చిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో సీఐటీయూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం కార్మికుల పట్ల అనుచితంగా వ్యవహరిస్తూ వారి హక్కులను కాలరాసిందన్నారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోతే ఐక్యపోరాటాలు సాగించాల్సి వుంటుందన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, గోపాల్, శివకుమార్, బీవీ రమణయ్య, సురేష్, ముత్యాలయ్య, మణి, చంద్రయ్య, పెంచలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ విద్యార్థులకు ప్రయోగాలపై శిక్షణ ఇవ్వాలి

తిరుపతి(విద్య), సెప్టెంబరు22: ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల పరిధిలోని జూనియర్ కళాశాలల్లో జనరల్ సైన్స్, వొకేషనల్ కోర్సులు చదివే విద్యార్థులు తప్పనిసరిగా ప్రయోగ తరగతులు నిర్వహించాలని ప్రాంతీయ ఇంటర్మీడియట్ బోర్డు పర్యవేక్షణాధికారి(ఆర్ఐవో) జీవీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ విషయమై ఈ నెల 4న జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌కు నిర్వహించిన సమావేశంలో వివరించామని తెలిపారు. ఏ కళాశాలలోనైనా ప్రాక్టికల్స్ నిర్వహించడంలేదని సమాచారం అందితే బోర్డు నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎస్వీయూ అడ్మిషన్ల విభాగానికి నూతన సారథ్యం

### నేడు కొత్త అధికారుల బాధ్యతల స్వీకరణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 22: ఎస్వీయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ (డీఓఏ) విభాగానికి నూతన అధికారులు సారథ్యం వహించనున్నారు. ఇప్పటి వరకూ డీవోఏ డైరెక్టర్‌గా ఇంజినీరింగ్ కాలేజీ ప్రొఫెసర్ శ్రీమురళి వ్యవహరించారు. సోమవారం ఆయన ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నారు. నూతన డీవోఏ డైరెక్టర్ వర్సిటీ సౌత్ ఈస్ట్ ఏషియన్ అండ్ పసిఫిక్ స్టడీస్ (సీప్) ప్రొఫెసర్ పూకా రమేష్‌బాబు, జాయింట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ మధు(జియాలజీ), అసిస్టెంట్ డైరెక్టర్‌గా ప్రొఫెసర్ శంకర గణేష్ (ఫైన్ ఆర్ట్స్ విభాగం) నియమితులయ్యారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

## డివైడర్‌పై నక్కలోళ్ల దుకాణాలు దగ్ధం

### రూ.2 లక్షల ఆస్తి నష్టం



దగ్ధమైన దుకాణాలు

నాయుడుపేట, సెప్టెంబరు 22: నాయుడుపేట ప్రభుత్వాస్పత్రి ఎదుట డివైడర్లపై ఉన్న నక్కలోళ్ల దుకాణాలు ఆదివారం తెల్లవారుజామున అగ్నికి ఆహుతయ్యాయి. పట్టణంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట దాదాపు 50 సంవత్సరాలుగా నక్కలోళ్లు దుకాణాలు, నివాసాలు ఏర్పరుచుకొని నివసించేవారు. సదరు స్థలం ఓ ప్రైవేట్ వ్యక్తికి చెందినదని కోర్టు తీర్పు ఇవ్వడంతో అధికారులు స్థలాన్ని అప్పగించారు. దీంతో నిరాశ్రయులైన నక్కలోళ్లు డివైడర్లపై దుకాణాలు, గుడారాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నారు. అయితే ఆదివారం తెల్లవారుజామున దుకాణాలు దగ్ధమయ్యాయి. ఇది ప్రమాదం వల్ల జరిగిందా... లేక ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పంటించారా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. కాగా, అగ్ని ప్రమాదంలో మూడు దుకాణాలు పూర్తిగా దగ్ధమయ్యాయని, వాటి విలువ దాదాపు రూ.2 లక్షలు ఉంటుందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుకాణాలు పూర్తిగా దగ్ధం కావడంతో జీవనోపాధి కోల్పోయామని, ప్రభుత్వం ఆర్థిక సాయం చేయాలంటూ నక్కలోళ్లు కోరుతున్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

గూడూరు, సెప్టెంబరు 22: శాంతిభద్రతల పరిరక్షణ కోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ రమణకుమార్ అన్నారు. ఆదివారం గాంధీనగర్ సమీపంలోని టిడ్కో గృహాల్లో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శివారు ప్రాంతాల్లో నేరాలు అదుపు చేసేందుకు తనిఖీలు చేపట్టామన్నారు. ఎవరైనా కొత్త వ్యక్తుల సంచారం ఉంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి విక్రయం, అక్రమణ రవాణా, రౌడీయిజాన్ని అరికట్టేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో సీఐలు శేఖర్‌బాబు, శ్రీనివాస్, ఎస్ఐ మనోజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

### వడ్డిపాలెంలో...

పెళ్లకూరు: మండలంలోని చిల్లకూరు వడ్డిపాలెంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలో ఇంటింటినీ తనిఖీ చేశారు. పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు. అనుమానితులు ఎవరైనా గ్రామంలో సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సంగమేశ్వరరావు, ఎస్ఐ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## డీఆర్‌డీఏ పీడీగా శోభన్‌బాబు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ పీడీగా టి.ఎన్.శోభన్‌బాబును నియమిస్తూ ఆదివారం రాత్రి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయన ప్రస్తుతం చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (డ్వామా) ఏపీడీగా పనిచేస్తున్నారు. ఆరు నెలల క్రితం డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్న జ్యోతి ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి పీడీగా ప్రస్తుతం ఏపీడీగా ఉన్న ప్రభావతి విధులు నిర్వహిస్తున్నారు. శోభన్‌బాబు ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ చంద్రగిరి, వడమాల, రామచంద్రాపురం ప్రాంతాల్లో ఎంపీడీవోగా పని చేశానని, జిల్లాపై అవగాహన ఉందని అన్నారు. శ్రీవారి చెంత పనిచేయడం సంతోషంగా ఉందన్నారు.

## రెగ్యులర్ డీపీవోగా సుశీలాదేవి



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 22: తిరుపతి జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్‌గా సుశీలాదేవిని నియమిస్తూ పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశి భూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆమె డీఎల్‌డీవోగా విధులు నిర్వహిస్తున్నారు. రెండు న్నర నెలలుగా ఇన్‌చార్జి డీపీవోగా వ్యవహరిస్తున్నారు. ఎట్టకేలకు రెగ్యులర్ డీపీవోగా సుశీలాదేవిని నియమించారు. గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తూ ప్రభుత్వం అందించే పథకాలను ప్రజలకు చేరువ చేస్తామని ఆంధ్రజ్యోతితో చెప్పారు.

## కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జిగా సుధాకర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 22: కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా ఇన్‌చార్జిగా ఇ.సుధాకర్‌రెడ్డి నియమితులయ్యారు. రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జుల జాబితాను విడుదల చేశారు. సుధాకర్‌రెడ్డిని పలువురు కాంగ్రెస్ నేతలు అభినందించారు.